వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 17 మే 2023

## వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ నోటీసులు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటి వద్ద సీబీఐ అధికారులు

**పులివెందుల, మే 15, ప్రభాతవార్త ః**

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి మరోమారు సీబీఐ అధికారులు నోటీసులు జారీచేశారు. మంగళవారం హైదరాబాదులోని సీబీఐ కార్యాలయానికి హాజరు కావాలని ఇదివరకే నోటీసులు జారీచేశారు. కానీ వైఎస్ అవినాష్‌రెడ్డి నాలుగురోజుల వరకు పలు కార్యక్రమాలు ఉన్నాయని, తరువాత హాజరవుతానని సీబీఐకి తెలపడంతో మోమారు మంగళవారం మధ్యాహ్నం సీబీఐ అధికాఉలు పులివెందులలోని వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అవినాష్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి డ్రైవరు నాగరాజుకు నోటీసు ఇచ్చారు. ఈ నోటీసులో ఈనెల 19న మధ్యాహ్నం 3.00గంటలకు హైదరాబాదులోని సీబీఐ కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు.

## ఎర్రచందనం జోలికి వెళితే కటకటాలు తప్పవు

### ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు



**రైల్వేకోడూరు రూరల్, మే 16 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం జోలికి వెళితే కటకటాలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. బుధవారం రైల్వే కోడూరు పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేరస్థులు ఎవరైనా అక్రమంగా ఎర్రచందనం జోలికి వెళితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరు పట్టణంలో పోలీసుస్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉన్న విషయం విధితమే. త్వరలోనే రిక్రూట్ అయిన అభ్యర్థులను నియమించి స్థానిక పోలీసుస్టేషన్‌కు న్యాయం చేస్తామని అన్నారు. మట్కా, జూదశాలలు ఎవరైనా నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేకోవలో ఇటీ వల కాలం నందు మాధవరం పోడు నందు భార్యాభర్తలు ఒక వృద్ధుడిని విచక్షణారహితంగా కొట్టడంతో వృద్ధులు మృతిచెందిన సమాచారాన్ని కొంతమంది దాచిపెట్టి ఎట్టకేలకు కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌పి గంగాధర్‌రావు మృతుని సమాచారం తెలుసుకున్న సందర్భంలో ఆయన భార్యాభర్తలపై కేసు నమోదు చేసి న్యాయ దర్యాప్తు చేపట్టాలని ఎస్‌పి గంగాధర్ రావు డిఎస్‌పి చైతన్యను ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ కు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

### ఎన్టీఆర్ ఒక ప్రజానాయకుడు

### మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమారెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు







**రాయచోటి, మే 16 ప్రభాతవార్త**

ఎన్టీఆర్ అంటే ప్రజా నాయకుడు అని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం మినీ మహానాడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. అన్నమయ్య జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లోని తెలుగు దేశం పార్టీ ఇన్చార్జిలు అనుబంధ సంస్థల సభ్యులు కార్యకర్తలు ఎన్టీఆర్ శతజయంతోత్సవాలకు హాజరయ్యారు. రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్స వాలు మినీ మహానాడు జరిగింది ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన రామారావు ఆరు నెలల కాలములో ముఖ్యమంత్రి కావడం కాంగ్రె స్ పార్టీ భూస్థాపితం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు వృ ద్ధాప్య పెన్షన్ నదుల అనుసంధానం హైటెక్ సిటీ రెండు రూపా యల కిలో బియ్యం పథకం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికైనా పాటుపడిన ఘనత ఎన్టీఆర్ దాన్నారు సమావేశంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్య డు ఆర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మహిళల కోసం డ్వాక్రా గ్రూపులు నదులు అనుసంధానం ఏది చెప్పినా నిబద్ధతతో చేసే నాయకుడు ఎన్టీఆర్ అన్నారు ఈరోజు మనమందరం విదేశాలలో కలిసి కూర్చొని మాట్లాడుకుంటున్నామంటే దానిలో చంద్రబాబు కృషి ఎంత ఉందన్నారు తెలుగుదేశం పార్టీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడే పార్టీ ఈనాడు ఈ స్థాయికి తెలు గుదేశం పార్టీ చేరిందంటే చంద్రబాబు దార్శనికత కు నిదర్శనం అంటూ కొనియాడారు సమావేశంలో రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో మా కుటుంబానికి ఎం తో అనుబంధం ఉందన్నారు మన రాష్ట్రం కోసం కష్టపడుతూ నారా లోకేష్ బాబు పాదయాత్ర చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు మినీ మహానాడును తెలుగుదేశం కార్యకర్తలు అందరి కృషితో సక్సెస్ చేశారని కొనియాడారు తెలుగు దేశంలో ఎన్నో కుటుంబాలు 40 సంవత్సరాల నుంచి వెన్ను ఎముకగా ఉన్నాయన్నారు. టిటిడి పాలక మండలి మాజీ సభ్యుడు ప్రసాద్ బాబు మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ సైనికుల పనిచేసి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూర్చాలని అప్పుడే ఘనమైన నివాళి అన్నారు సమావేశంలో న ల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు రాజంపేట నియోజకవర్గం తెలు గుదేశం పార్టీ ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం త్వరలో కనుమరుగు కాబోతుందన్నా రు. పార్టీ స్థాపించినప్పుడు ఫ్యాన్ ఒకట్లో పెడితే ఐదు లో పరిగె త్తేదని ప్రస్తుతం ఐదు లో పెడితే ఒకటిలో పరిగెడుతుందన్నారు. ప్రజలకు చేసింది వైసీపీ ప్రభుత్వం శూన్యం అన్నారు సమావేశంలో రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గంట నరహరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్టీ రామారావు స్థాపించి పేద ప్రజలకు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. సమావేశంలో మదనపల్లె నియోజకవర్గం ఇంచార్జ్ దొమ్మలపాటి రమేష్ అనూష రెడ్డి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ భాష చల్లా రామచంద్రారెడ్డి పల్లె రఘునాథ్ రెడ్డి తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థల నాయకులు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు ఈ శత జయంతి ఉత్సవాలకు తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు, రాజంపేట, రైల్వే కోడూర్ రాయచోటి నియోజవర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



**సమావేశంలో తోపులాట**

రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రసంగించేటప్పుడు మైక్ ఎల్ సి డి వైర్ కట్ కావడంతో రాంప్రసాద్ రెడ్డి వర్గీయులు తమ నాయకుని ప్రసంగం కావాల్సింది వైర్ తొలగించారని మండిపడ్డారు. ఒక దశలో సమావేశం రసా బసగా మారింది రాంప్రసాద్ రెడ్డి సభ వేదిక నుంచి దిగి తన అనుచరులను బయటకు తీసుకెళ్లి సభ నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.

## సజ్జల దృష్టికి డాక్టర్ బిఆర్ గురుకులాల సమస్యలు



సజ్జలను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులు

**పులివెందుల, మే 15, ప్రభాతవార్త ః**

ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి దృష్టికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీచర్స్ ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఏపీ జిఈఎస్‌చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి, వైఎస్ఆర్ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నజురుల్లా ఆధ్వర్యంలో రెగ్యులర్ ఉద్యోగులకు 60 నుండి 62 సంవత్సరాల వయో పరిమితి పెంపు అమలు చేయాలని కాంట్రాక్టు టీచర్స్ ప్రతి సంవత్సరం 10రోజుల గ్యాప్ పీరియర్ తరువాత రెన్యువల్ చేయాలని, గత 16ఏళ్ల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్‌ను రెగ్యులర్‌చేయాలని, సంస్థలో సుమారు 1800మంది పార్ట్‌టైం టీర్స్ గత పదేళ్ల నుండి తక్కువ వేతనం తీసుకుని పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్స్‌ను ప్రతి సంవత్సరం లాగే డైరెక్టు రెన్యువల్స్ ఇవ్వాల్సి ఉండగా సంస్థ అధికారులు పేపరు ప్రకటన ద్వారా డెమోస్ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం వల్ల 1800మంది రోడ్డున పడే అవకాశం ఉందని, వీరికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. కాంట్రాక్టు, పార్ట్‌టైం, వ్యాయామ టీచర్స్ తక్కువ వేతనంను కూడా పరిశీలించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ నాయకులు తులసిరామ్, పిడి రామచంద్రారెడ్డి గురురత్నం, అమర్‌నాథ్‌రెడ్డి, మురగారెడ్డి, తిరుపాల్, ప్రవీణ్, జాన్సీ, అంజని, చిన్నయ్య, నరేంద్ర, శ్రీహరి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం కోసం కొట్టి చంపేశాడు

### తమ్ముడి హత్యకేసులో అన్న అరెస్టు

**మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త:**



ఇంటిస్థలం కోసం సొంత తమ్ముడినే హత్య చేసిన అన్నను మంగళవారం ఉదయం అరెస్టు చేసినట్లు మదనపల్లె డిఎస్‌పి కేశప్ప తెలిపారు. డిఎస్‌పి కథనం మేరకు కురబలకోట మండలం గుణకుంట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డికి ముగ్గురు కుమారులు గంగాధర్, ప్రహ ల్లాద, విశ్వామిత్రలుకలరు. వీరిలో ప్రహల్దాకు, మిగతా ఇద్దరు సోదరులకు మద్య ఇంటిస్థలం విషయమై కొంత కాలంగా వివాదం ఉంది. ఈ స్థలం విషయమై ప్రహల్దాకు కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో ప్రహల్లాద కావాలనే తన ఇంటి ముందు దారి లేకుండా కటెటలను అడ్డుగా వేశాడు. ఇతని ఇంటిని దాటు కునే విశ్వామిత్ర, గంగాధర్ ఇంటికి వెళ్ళాల్సి ఉంటుంది. కట్టెలు వాళ్ళకు తగులు తున్నాయని ఈనెల 2న విశ్వామితత్ర కట్టెలను తీసి పక్కకు వేస్తుండగా ఆగ్రహిం చిన ప్రహల్దా తన సోదరుడు అని కూడా చూడకుండా అవే కట్టెలతో విశ్వామిత్రపై దాడి చేసి కొట్టాడు. ఈ సంఘటనలో సృహతప్పి పడిపోయిన విశ్వామిత్రను పెద్ద సోదరుడు గంగాదర్, కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వా సుపత్రికి తీసుకొచ్చారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్‌కు తీసు కెళ్ళారు. గంగాధర్ వచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో దాడికేసు నమోదు చేశారు. అసుపత్రిలో చికిత్స పొందుతూ విశ్వామిత్ర ఈనెల 13న మృతి చెందా డు. దీంతో రూరల్ సిఐ శివాంజనేయులు, ముదివేడు ఇన్‌చార్జ్ ఎస్ఐ రామ్మోహన్ దాడి కేసు హత్యకేసుగా మార్పుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రహల్లాదను అంగళ్ళులో అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుడు ప్రహల్లాద తన సోదరుడు విశ్వామిత్ర బ్రతికి ఉంటే కోర్టుకు వెలుతాడని భావించి కావాలనే పథకం ప్రకారం కట్టెలతో కొట్టి చంపాడని డిఎస్‌పి వెల్లడించారు. నిందితున్ని అరెస్టుచేసిన సిఐ, ఇన్‌చార్జ్ఎస్ఐని డిఎస్‌పి అభి నందించారు.

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల దాడులు

### - 11 మంది ముఠా అరెస్ట్ - 23 కేజీల గంజాయి, ఆటో, 2 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్లు, రూ.48,800 నగదు స్వాధీనం

### - గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

### - మీడియా సమావేశంలో ఎస్పీ అన్బురాజన్





**కడప క్రైం, మే 16, ప్రభాతవార్త:**

కడప నగరం టుటౌన్ పీఎస్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న 11 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 23.3 కేజీల గంజాయి, ఆటో, 2 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్లు, రూ.48,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గత కొంత కాలంగా టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు రాబడిన స్పష్టమైన సమాచారంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముద్దాయిలపై గట్టి నిఘా ఉంచాలని తాను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎస్‌బీ సీఐ రాజా ప్రభాకర్, టుటౌన్ సీఐ సయ్యద్ హాసం, వారి సిబ్బంది రాబడిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ముఠా సభ్యులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. అరెస్టు అయిన వారిలో కడప అల్మాస్‌పేటకు చెందిన పఠాన్ అఫ్జల్‌ఖాన్, మాసాపేటకు చెందిన పాణ్యం అశోక్‌కుమార్, మున్నగాని వర్ధన్, తారకరామానాగర్‌కు చెందిన పూల రాజేష్, పూలా సరస్వతి, పూలా నాగవేణి, గౌస్‌నగర్‌కు చెందిన షేక్ సయ్యద్, రాజారెడ్డివీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా, ప్రొద్దుటూరుకు చెందిన రమేష్‌లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి పట్టుబడిన గంజాయి, వాహనాలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎవరైనా గంజాయి దాచినా, అమ్మినా, కొన్నా, అక్రమ రవాణా చేసిన, సహకరించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటీవల కాలంలో దాదాపు 50 మంది స్మగర్లర్లను అరెస్టు చేశామన్నారు. పదే పదే గంజాయి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఈ ఏడాది ఇప్పటి వరకు 7 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. గంజాయి వినియోగిస్తున్న వారికి ఇప్పటికే రిహాబిలేషన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. విద్యా సంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినట్లు తెలిస్తే తన నెంబరు 9440796900, లేదా డయల్ 100కు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. ఈ ముఠాను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సై, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించి రివార్డులు కూడా అందజేస్తామన్నారు.

## విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలి

### జాయింట్ కలెక్టర్ గణేష్

**కడప, మే 16, ప్రభాతవార్త:**



ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి "జగనన్న విద్యా కానుక" కిట్లను అన్ని పాఠశాలల్లో పంపిణీకి సిద్ధం చేయాలని.. మనబడి "నాడు-నేడు" పనులను ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని.. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో.. మనబడి "నాడు నేడు" ఫేస్-2 పనుల పురోగతిపై.. సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డితో కలిసి జేసీ జి. గణేష్ కుమార్.. విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు "జగనన్న విద్యా కానుక" కిట్లను అన్ని రకాల కంపోనెంట్లతో కలిపి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎం.ఈ.ఓ.లు., ఏపీఓ లు వారి పరిధిలోని అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లలో ఏ ఒక్కటీ కొరత లేకుండా సిద్ధం చేయాలన్నారు. రెండవ దశ నాడు-నేడు పనులకు సంబంధించి 9 కాంపోనెంట్స్ ను ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాతే.. అదనపు తరగతుల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. నాడు-నేడు పనులను.. సంబందిత ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ.. నాణ్యతలో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్యను పెంచండి

### - కాన్పుల సంఖ్యను గణనీయంగా పెంచాలి

### - ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**సంబేపల్లె, మే 16, ప్రభాతవార్త:**



ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం సంబేపల్లె మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మందుల రూములు, ల్యాబ్, స్టోర్ గదులను మందుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో కాన్పులు నెలకు ఎంత మేరకు నమోదవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇంత తక్కువగా నమోదవడం ఏమిటని వాటిని గణనీయంగా పెంచాలని ఆదేశించారు. ఆపరేషన్లు కాకుండా సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని అత్యవసరమైతేనే సిజేరియన్ చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేదలు వస్తుంటారని కావున వారికి నమ్మకమైన వైద్య సేవలను అందించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు.

**నాడు-నేడు పనుల పరిశీలన..**

నాడు-నేడు పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులు పక్కాగా సాగాలని జిల్లా కలెక్టర్ పేద జంగంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు రెండో దశ పనులు పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఫ్లోరింగ్ బెడ్, టాయిలెట్లు మరమ్మతులు తదితర పనులను పరిశీలించి ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు, ఇంకా ఎంత ఖర్చు చేయాల్సి ఉంది అని వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించండి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని గిరీష పీఎస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మోటగట్ల గ్రామం కేతంరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బందితో పిల్లల వివరాలు తెలుసుకొని ఎంత మంది హాజరయ్యారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు, హాజరు పట్టిక వివరాలను పరిశీలించారు. వారితో కాసేపు ముచ్చటించి వారి వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలో తేడాలు ఉండడంతో కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఆధార్ మ్యాపింగ్ అయిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌వో కొండయ్య, తహసీల్దార్ మహేశ్వరి బాయ్, డీఈవో పురుషోత్తం, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను తీర్చలేని అధికారులు విధుల నుండి తప్పుకోండి : ఎమ్మెల్యే





**వీరబల్లి, మే 16, ప్రభాతవార్త :**

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం రభసగా జరిగింది. ముఖ్యంగా ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి అన్ని శాఖల అధికారుల పై మండి పడ్డారు. అయన ఒక దశలో మండల అధికారుల పని తీరు పై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాటిగుంటపల్లి ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి స్థానిక ఏఈ శ్యామ్ పై వచ్చిన ఆరోపణ తో మండి పడ్డారు. ముక్యంగా అతను ప్రజలపై చేస్తున్న అరాచకాలు అంటూ ప్రూఫ్లతో సహా వివరించే సరికి ఎమ్మెల్యే అసహనం కోల్పోయి జగనన్న ప్రజలకు ఏమి ఇబ్బంది లేకుండా చూడండి అంటుంటే ఇంత చేస్తావా అని ఏ ఈ పై మండిపడ్డారు. ముఖ్యముగా నీకు ఉద్యోగం చేయడం ఇష్టం లేక పోతే మానెయ్యే అని హెచ్చరించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో గ్రామ సభ జరపాలని తెలిపారు. గ్రామ సభ లో ప్రజలకు ఉపయోగ పడే పనులే చేయండి అని తెలిపారు. అనంతరం విద్యా శాఖ పై సామీక్ష జరిపారు. మండలం లో 10వ తరగతిలో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన విద్యార్థులకు రూ.1016 అందించారు. అనంతరం వైద్యం పై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ వినయ్ బాబు మాట్లాడుతూ మండలంలో మనకు 104, 108 సేవలను వినియోగించు కూండి అని అన్నారు.అనంతరం ఎంపీపీ గాలివీటి రాజేంద్ర నాధ రెడ్డి మాట్లాడుతూ మండలంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల వైసీపీ నాయకుడు గాలువీటి వీరనగి రెడ్డి, ఎంపీడీఓ మల్లేశ్వరి. తహసీల్దార్ తులాసమ్మ, సర్పంచులు, ఎంపిటీసీలు వైసీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మోడెం నాగభూషణం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాడు-నేడు నిధులు దుర్వినియోగంపై ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్

**చిన్నమండెం, మే 16ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని చిన్నమండెం బాలురోన్నత పాఠశాల నాడు-నేడు పనుల్లో నిధులు దుర్వినియోగం చేశాడని ప్రధానోపాధ్యాయుడు జయచంద్రను ఆర్జేడి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను మంగళవారం డిఈవో కార్యాలయానికి పంపినట్లు సమాచారం.

## వైసిపి ప్రభుత్వంపై విష ప్రచారం టిపికి తగదు

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

ప్రొద్దుటూరు, మే 16, ప్రభాతవార్త :



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై విష ప్రచారం చేయడం టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరు పల్లె లో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్పార్టీపై, ముఖ్యమంత్రి జగన్ పై విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా టీడీపీ నాయకులు తమ ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారే తప్ప పాలనాపరంగా మా వైఫల్యాలు ఏమిటో చెప్పడం లేదన్నారు. చంద్రబాబు పరిపాలనను చూసి విసుగు చెందే ప్రజలు వైఎస్సార్సీపీకి పట్టం కట్టారన్నారు. ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అరాచక పాలన అని విమర్శిస్తున్న వారు అరాచకాలు ఏమిటో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మ ఒడి, మన బడి నాడు - నేడు, రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాలు టీడీపీ ప్రభుత్వంలో ఉన్నాయా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మాత్రమే ఆరోగ్యశ్రీ,, పీజురీయింబర్స్మెంట్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ల వ్యవస్థను తమ ప్రభుత్వం ప్రవేశపెట్టడంతోపాటు లక్షా 43 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ శావలి లక్ష్మీదేవి వెంకటరాముడు, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య మంజునాథ శర్మ, మాజీ మార్కెట్ యార్డు చైర్పర్సన్ యాలం తులశమ్మ శంకరయ్య, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య పాల్గొన్నారు.

## ఇద్దరు నిందితులు అరెస్టు

పీలేరు, మే 16 ప్రభాతవార్తః

పట్టణ పరిసరాలలో ఇతర మండలాలకు చెందిన ద్విచక్ర వాహనాలు దొంగతనాలు జరిగాయి. దీనిపై స్థానిక ఎస్సై నరసింహుడు తమ సిబ్బందితో ప్రత్యేక దష్టిసారించి కలికిరి మండలానికి చెందిన దేరంగుల శివ, మేడికుర్తి సందీప్ కుమార్ అను అరెస్టుచేసి వారి వద్ద నుంచి ఐదు ద్విచక్రవాహనాలును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు ర.2.50లక్షలు వరకు ఉంటుందన్నారు. ఇద్దరు నిందితులను రిమాండుకు పంపినట్లు తెలిపారు.

## అలివేలమ్మ సేవలు చిరస్మరణీయం

వాల్మీకిపురం, మే 16 ప్రభాతవార్తః



సంఘ సేవకురాలు అలివేలమ్మ (79) సేవలు చిరస్మరణీయమని తెదేపా జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యవారి పల్లెకు చెందిన అలివేలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కిశోర్‌కుమార్‌రెడ్డి తెదేపా నాయకులతో కలిసి అలివేలమ్మ మతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి మృతు రాలి కుమారుడు హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డిని పరామర్శించారు. ఎంతోమంది నిరుపేదలను అలివేలమ్మ ఆదుకుందని నిరుపేద విద్యార్థులకు చేయూతనిచ్చిందని కిశోర్‌కుమార్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, తెదేపా నాయకులు వెంకటరమణ, రాజేంద్రా చారి, దాము , ఆనంద, శేషాద్రిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ

వాల్మీకిపురం, మే 16 ప్రభాతవార్తః



నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.16 లక్షలు నిధులు మంజూరై య్యాయి. ఈనగదు చెక్కులను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో లబ్దిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేదల అనారోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిం దన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని చింతపర్తి పంచాయతీలోని పూజారి వాండ్లపల్లె, దాసరవాండ్లపల్లె ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజా సమస్య లను అడిగి తెలుసుకున్నారు,. పరిష్కారమయ్యే గ్రామ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కేశవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటరమణారెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఎంపీపీ

కలకడ, మే 16 ప్రభాతవార్తః



మండల కేంద్రంలో మంగళవారం ఎంపీపీ శ్రీదేవి రవికుమార్ ప్రభుత్వ వద్యశాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు రకరకాల జబ్బులతో ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వారి ఆరోగ్యాన్ని బాగుచేసుకోవాలని వస్తుంటారన్నారు. అలాంటి పేషెంట్లును వైద్యులు మ ంచిగా మాట్లాడి వారికి తగిన జబ్బులకు తగిన మందులు ఇవ్వడం మంచిదన్నారు. ఓపీ రికార్డులను ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంటు రికార్డులను తనికీచేశారు. మన ప్రభుత్వం వైద్య శాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యతని తెలిపారు. ఈతనిఖీ కార్య క్రమంలో ఎంఒ వైద్యాధికారి మల్లికార్జున, ఎంపీహెచ్ఓ సూపర్‌వైజర్, ఏఎన్ఎమ్ లు , వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దోమకాటు - ఆరోగ్యానికి హానికరం

కేవి.పల్లె, మే 16 ప్రభాతవార్తః



దోమలు ప్రజారోగ్యానికి పెద్ద శత్రువులని వాటి కాటు వల్ల మనుషులు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి రేష్మా పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గర్నిమిట్ట గ్రామంలో ఆరోగ్య సిబ ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ జ్వరం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడీస్ రకం దోమ డెంగీ జ్వరం వ్యాప్తికి కారణమని ఈరకపు దోమలు మంచినీటిలో గుడ్లు పెట్టి వద్ది చెందుతాయని కావున ప్రతి ఒక్కరు గహ పరిసరాలలో నీరు నిల్వ ఉండుటకు ఆస్కారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈదోమలు పగటిపూట కుడుతాయని తెలియజేశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే - డ్రైడే పద్ధతిని పాటించాలని సూచించారు. దోమకాటు బారిన పడకుండా దోమతెరలు, కిటికీలకు తలుపులకు మెస్ అమర్చుకోవాలన్నారు. ప్రజలందరికి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో భాగ్యలక్ష్మీ, రమాదేవి, కష్ణయ్య, చెన్నమ్మ, ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీఐఓ గారు గ్యారంపల్లె పీహెచ్‌సీ తనిఖీ

కేవి.పల్లె, మే 16 ప్రభాతవార్తః



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఐఓ గ్యారంపల్లె పీహెచ్‌సీని తనిఖీచేశారు. ఆమె వెంట ఇమ్యూనైజేషన్ అధికారి ఉషశ్రీ, సీహెచ్ఓ నారాయణ, సమావేశం నిర్వహించి డెంగీ జ్వరాలపై అవగా హన కల్పించారు. టార్గెట్స్ అచీవ్‌మెంట్సు రివ్యూ చేశారు. డెంగీ డే సందర్భంగా దోమల వలన వ్యాప్తి చెందే వ్యాధులు గురించి అవగాహన చేపట్టారు. కార్య క్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే జగనన్న పట్టాలు పంపిణీ

పీలేరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్తః

పీలేరు గ్రామ పరిధిలో ఇప్పటికే రెండు విడతలుగా జగనన్న పట్టాలు పంపిణీ చేశామని మరో విడత నేడు ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీషాపీఎస్ చేతులు మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని సర్పంచి హబీబ్‌బాషా తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగంగా గూడులేని నిరుపేదలకు జగనన్న పథకంలో ఇప్పటికే వేల సంఖ్యలో పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగిందని , మరో విడత పంపినీ చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారని ఆయన అన్నారు. ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పెద్దన్నను పరామర్శించిన టిడిపినాయకులు

పెద్దమండ్యం మే 16 ప్రభాతవార్త



తెలుగుదేశం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాలోకేష్ ఆద్వర్యంలో సాగుతున్న యువ గళం పాదయాత్ర 100 రోజులు పూర్తిఅయిన సందర్భంగా రాష్ట్ర టిడిపి పార్టీనాయకులు పిలుపుమేరకు సోమవారం మొలకల చెర్వులో టిడిపి శ్రేణులు శాంతియుతంగా పాదయాత్ర చేసుకుంటుండగా వైసీపి నాయకులు హటాత్తుగా రోడ్డుపైకివచ్చి మాపైకట్టెలతో, రాళ్ళతోదాడి చేశారు. ఈ క్రమంలో తెలుగు దేశం కార్యకర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. పెద్దమండ్యంకు చెందిన పాపేపల్లె గ్రామఅధ్యక్ష్యుడు పెద్దన్నకు తలకుతీవ్రగాయాలు కావడంతో మదనపల్లె ఏరియా ఆసు పత్రికితరలించి చికిత్సలు అందిస్తున్నారు. వీరిని మంగళవారం మండల తెలుగుదేశం మాజి అద్య క్షులు నానబాల ప్రసాద్, గుత్తికొండ త్యాగరాజు, రామాంజులు, నాగేశ్వర్‌రెడ్డి, సీతాపతిరెడ్డి, కలిచెర్లసయ్యద్‌షావల్లి, పాలగిరి సయ్యద్ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా,హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ఇందుకు పోలీసులుసైతం టీడీపీనాయకులను అడ్డుకోవడం ఎంతవరకూ సమంజసమో వారివిజ్ఞతకే వదిలేస్తున్నాం అన్నారు. ఇలాంటి సంఘటనలు గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగలేదని ప్రజలు గమనిస్తు న్నారని త్వరలో తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవ వేడుకలు

పులివెందుల, మే 15, ప్రభాతవార్త ః



తొండూరు ప్రాథమిక కేంద్రంలో మంగళవారం డాక్టర్ అరిఫుల్లా ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సిబ్బంది అందరు కలిసి భారీ ర్యాలీ నిర్వ హించారు. పరిసరాల శుభ్రత.. మనందరి బాధ్యత, దోమతెరలు వాడుదాం.. దోమకాటు నివారిద్దాం నీటినిల్వలు.. దోమలకు నిల యాలు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచు కోవడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే ప్రాణాంతకమైన డెంగ్యూ వ్యాధి నుండి కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తొండూరు, మల్లేల, మదూరు, ఇనగ లూరు, బూచుపల్లె గ్రామాలలో డెంగ్యూ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, సూపర్‌వైజరు శశికళ, గ్రామఆరోగ్య అధికారిణులు, ఆరోగ్యఆశ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లకు కనీస వేతనం పెంచాలి

వేంపల్లె, మే 15, ప్రభాతవార్త ః



గర్భవతులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తున్న ఆశవర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని, సెలవులు ప్రకటించాలని ఆశవర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్య క్షుడు వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటి జనరల్ సెక్రెటరీ కెసిబాదుల్లా, నాయకులు చంద్రశేఖర్‌తోపాటు ఆశా వర్కర్లయూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్పనలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లె లోని అక్షర బాలికల జూనియర్ కళాశాలలో ఆశావర్కర్లతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఉద్యోగ భద్రత, సాధా రణ సెలవులు, మెటర్నిటీ సెలవులు లేకుండా 24గంటలు పనిచేస్తున్న ఆశవర్కుకు సెలవులు మంజూరు చేయకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.10వేల నుండి రూ.15వేలకు పెంచుతామని చెప్పిన మాటను నిలబెట్టుకుని తక్షణమే జీవో జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు రాణి, గౌతమి, జయమ్మ, ఎలిజ బెత్, జమీనా, రమణమ్మ, లక్ష్మిదేవి, సుశీల, రమణమ్మ, భారతి పాల్గొన్నారు.

## మైనార్టి స్కూళ్లలో బాలబాలికలకు అడ్మిషన్లు

వేంపల్లె, మే 15, ప్రభాతవార్త ః

వేంపల్లెలోని బాలికల, కడప రామాంజనేయపురంలోని బాలుర మైనార్టి స్కూళ్లలో 5వ తరగతిలో డైరెక్టుగా అడ్మిషన్ పొందవచ్చునని వేంపల్లె ప్రిన్సిపల్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. 6, 7, 8 తరగతులలో ఖాళీగా మిగిలి ఉన్న బ్యాక్‌లాక్ అడ్మిషన్లు కూడా భర్తీ చేస్తామన్నారు. ఆయా తరగతులకు సంబంధించిన విద్యార్థులు ఆయా పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈనెల 30వతేదీలోగా అడ్మిషన్లు పొందాలన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని విద్యాసంస్థలపై చర్యలకు వినతి

రాజంపేట అర్బన్, మే 16 ప్రభాతవార్త



రాజంపేట పట్టణంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు యధేచ్ఛగా చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ నేతలు సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్దఎత్తున ఫీజులు వసూళ్లు చేస్తూ దోపిడీ చేస్తున్నాయని సబ్‌కలెక్టర్‌కు వివరించారు. పలు పేర్లతో విద్యా సంస్థలు ప్రారంభించి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ ఉపా ధ్యాయులుగా పనిచేస్తూ పెట్టుబడులు పెట్టి విధులకు ఎగనామం పెట్టి పని చేస్తు న్నారని ఫిర్యాదు చేశారు. అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అన్న మయ్య జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు అఖిల్, సుభన్, సాయి, కార్తీక్, వెంకట్ పాల్గొన్నారు.

## ముస్లింలచే తాగునీటి సౌకర్యం

రైల్వేకోడూరు రూరల్, మే 16 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని జామా మసీదు వద్ద ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు హఫీజ్ షకీల్ జామా మసీదు ఆధ్వర్యంలో నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం యువజన సంఘం సంక్షేమ సంఘం షేక్ అహ్మద్‌బాషా, బాబాసాహెబ్, పఠాన్‌మౌలా, షేక్ హఫీజుదుల్లా, షేక్ మహ్మద్, షేక్ షలీంతో పాటు సయ్యద్ మన్సూర్ పాల్గొన్నారు. నిరుపేదలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో నీటి సౌక ర్యాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. దేశ చరిత్రలో ఎవరు చేయని సాహ సాన్ని ముస్లింలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.

## టిడిపి కౌన్సిలర్ సస్పెన్షన్

ప్రొద్దుటూరుఅర్బన్ మే 16, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన టిడిపి కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి, టిఎన్టియూసీ పార్లమెంట్ అధ్యక్షుడు చింతకుంట కుత్బుద్దీన్ లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చం నాయుడు ప్రకటించారు.

## పద్యాలలోని విలువలతో జీవితం పరిమళిస్తుంది



ప్రొద్దుటూరు రూరల్, మే 16, ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పట్ట ణం లోని పుట్టపర్తి నారాయణా చార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి మంగళవారం ప్రముఖ రచయిత, తెలుగు భాషోపాధ్యాయుడు డి.కె.చదు వుల బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పద్యాలలోని మంచిని గ్రహించి ఆచరిస్తే జీవితం పరిమళిస్తుందని పేర్కొన్నారు. వేమన, సుమతి, తెలుగు బాల మొదలగు పద్యాలు వినడం, పలకడం, చదవడం, వ్రాయడం వల్ల శ్రవణం, భాష ణం, పఠనం, లేఖనం మొదలగు సామర్థ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. చక్కటి ఆదర్శవంతమైన జీవితానికి పద్యాల లోని సందే శాలు మైలురాళ్లుగా నిలుస్తాయని, విలువలతో కూడిన నడవడిక ను పద్యాలు నేర్పిస్తాయని, ప్రతిఒక్కరూ బాల్యదశలోనే వందకుపైగా పద్యా లను పఠించ గలిగే సామర్థ్యాన్ని కల్గి ఉండాలని, పద్యాలలోని మంచిని జీవితం లో ఆచరిస్తే జీవితం ఋజుమార్గంలో సాగుతుందని అభిప్రాయ పడ్డారు. తెలివి, పందెం మొదలగు కథలను చెప్పి, ప్రశ్నించి, విద్యార్థుల అవగా హనను పరీక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న గజ్జెల వెంకటేశ్వరరెడ్డి బాలల గేయాలను పాడి విద్యార్థులతో పలికించారు. శ్రీకాంత్ స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారిణి తిరుపతమ్మ, జన విజ్ఞాన వేదిక అధ్య క్షుడు చంద్రశేఖర రావు, సంజీవరెడ్డి, గ్రంథాలయ హెల్పర్ జె గంగాదేవి, పాల్గొన్నారు.

## నంగనూరుపల్లె కళ్యాణమండప నిర్మాణానికి రూ.30లక్షల విరాళం

### మొదటి విడతగా రూ.10లక్షలు అందజేసిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు మే 16, ప్రభాతవాత



పొద్దుటూరు మండలం నంగునూరు పల్లె గ్రామంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గతంలో 30 లక్షల రూపాయలు విరాళం ప్రకటించిన నేపద్యంలో మంగళవారం 10 లక్షల రూపాయలను గ్రామ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంగనూరు పల్లె గ్రామ ప్రజలతో చాలా కాలం నుండి తనకు ఆత్మీయ సంబంధం ఉందన్నారు. 300 ఇల్లు 12 ఓటర్లు ఉన్న గ్రామంలో వివాహాది శుభకార్యాలకు గ్రామంలో కళ్యాణ మండపం లేని కారణంగా ప్రొద్దుటూరుకు పోవాల్సి వస్తుందని అది ప్రజలకు భారమవుతుం దన్న గ్రామ పెద్దల ఆలోచనతో గ్రామంలోని కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. కళ్యాణ్ మండపం నిర్మించాలంటే 60 నుండి 70 లక్షల రూపాయలు నిధులు అవసరమవుతావని గుర్తించి తన దృష్టికి తెచ్చి సహాయాన్ని కోరారన్నారు. గ్రామ పెద్దలు కోరిన విధంగా మొత్తం ఖర్చులో సగ భాగం గ్రామ ప్రజలు, సగభాగం తాను భరిస్తానని గత మూడు నెలల క్రితం చెప్పానని అందులో భాగంగానే 10 లక్షల రూపాయలను గ్రామ పెద్దలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సోములవారిపల్లె మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ యాలం తులసమ్మ వైసిపి నాయకులు యాలం శంకర్ మరియు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## కంకర వేశారు తాము మరిచారు





రాయచోటి టౌన్, మే 16 ప్రభాతవార్త :

సంబేపల్లి మండలం నారాయణరెడ్డి పల్లి గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి ని రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేశారు కానీ తారు మరిచారు. దాదాపు నాలుగు నెలలు క్రితం కంకరవేసి ఆ రోడ్డు మార్గంలో ప్రయాణికులు వెళ్లకుండా ముల్లకంచెను అడ్డుగా వేశారు. రాయచోటి నుంచి జగనన్న కాలనీకి వెళ్లే జనాలకు దారి లేక మోటకట్ల గ్రామం మీదుగా వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీకి నాలుగు నెలల నుంచి దారి మూసివేసి ఉన్న పట్టించుకోని కాంట్రాక్టర్ మరియు ప్రభుత్వ అధికారులు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఈ ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్నారని జగనన్నకాలనీకి వెళ్లే ప్రజలు చెప్పుకోవడం విశేషం ఆటోలో రాయచోటి నుంచి జగనన్న కాలనీకి మోటకట్ల గ్రామం మీదుగా వెళ్లాలంటే చాలా ఖర్చు అవుతుందని చాలా ఇబ్బంది పడుతున్నామని జగనన్న కాలనీవాసులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వ అధికారుల స్పందించి త్వరగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని జగనన్న కాలనీవాసులు కోరుతున్నారు.

## ప్రశాంతంగా మండల సమావేశం

మైదుకూరు మే 16,ప్రభాతవార్త





మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. మైదుకూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరము పలు శాఖలలో జరిగినటువంటి పనుల గురించి వివరించారు. ఏ.ఈ మధు మాట్లాడుతూ.. మైదుకూరు మండలంలో మొత్తం 928 గృహాలు మంజూరైనవని అందులో 216 బేస్మెంట్ లెవెల్ లో ఉన్నాయని,159 రూఫ్ లెవెల్ లో ను,108 ఇండ్లు ఆర్. సి లో ను, 279 కంప్లీట్ లో ఉన్నాయని అన్నారు. అలాగే కొత్తగా 175 ఇండ్లు అప్లై చేయడం జరిగిందని వీటి కొరకు ప్రతిపాదన పంపడం జరిగిందని అవి రాగానే వాళ్లకు తెలియచేసి పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు బిల్స్ పెండింగ్లో లేవని ఒకవేళ ఏమైనా పెండింగ్లో ఉంటే ఆధార్, రేషన్ కార్డు తీసుకుని వస్తే పరిశీలిస్తామన్నారు. రెవిన్యూ తరుపున ఎమ్మార్వో అనురాధ మాట్లాడుతూ...మైదుకూరు మండలంలో రెవిన్యూ కి సంబంధించిన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. గ్రీనిఫిల్డ్ హైవే క్రింద భూములు పోయిన రైతులకు చెక్కులు అందిస్తున్నామని ఇప్పటి వరకు 75శాతం రైతులకు చెక్కులు అందించామన్నారు. అలాగే లెక్కలవారిపల్లె స్మశాన వాటికకు భూమి కేటాయిస్తామన్నారు. పలుచోట్లా రెవిన్యూ అధికారుల కొరత ఉందని త్వరలో తీరుస్తామన్నారు. సర్వె నెంబర్ 691లో షాది ఖానా నిర్మిస్తామని.గోడౌన్ లకు కూడా స్థలం కేటాయిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎంపీడీఓ కులాయమ్మ, ఎమ్మార్వో అనురాధ. ఎంపీపీ థామోస్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి. మండల వైస్ ప్రెసిడెంట్ రఘురామి రెడ్డి. జడ్పీటీసీ ప్రసన్న లక్ష్మి,మూలే సుధాకర్ రెడ్డి తదితర ఎంపీటీసీ లు, సర్పంచ్ లుఅధికారులు పాల్గొన్నారు.

## మాస శివరాత్రి సందర్భంగా శ్రీపుష్పాచలేశ్వరునికి రుద్రాభిషేకం



ఖాజీపేట, మే 16 ప్రభాతవార్త :

శ్రీ పుష్పగిరి మహా క్షేత్రం పవిత్ర పంచనది సంగమ తటమున ఆంధ్ర అరుణగిరి శ్రీ పుష్పగిరి పర్వతంపైన స్వయంభుగా ఉద్భవించిన శ్రీపుష్పాచలేశ్వర స్వామి దేవస్థానం(నడిగట్టు దేవాలయం)ఇటీవల పునరుద్దరణలో భాగంగా నిత్యర్చనలు ప్రారంభించబడిన శ్రీ పుష్పాచలేశ్వర స్వామి ఆలయం (నడిగట్టు శివాలయం) స్వామి సన్నిధిలో వైశాఖ బహుళ చతుర్దశి గురువారం ఉదయం 8.30 నిమిషాలకు మాస శివరాత్రి సందర్భంగా క్షేత్ర అర్చక పురోహితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పంచామృత రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామం పూజ, భజనలు, తీర్థ ప్రసాద వితరణ, శాస్త్ర విధి, నిర్వహింపబడును అని కార్యనిర్వాహకులు శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక అధ్యక్షుడు అంబా బత్తుల అండకొండ రాముడు, అశ్విని, కిషోర్ యాదవ్ , వెంకట సాయి, జింక శశికాంత్, సోమశేఖర్, విగ్నేష్, శించన యాదవ్,లక్కు పుల్లారెడ్డి, చెన్నూరు గురుస్వామి నవీన్ చిత్తూరు తెలిపారు కావున భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రైతులకు అందుబాటులో లేని మండల సర్వేయర్

### - నాడు ఒక్కరితో పనులు జరిగేవి

### - నేడు పదుల సంఖ్యలో ఉన్నా పనులు శూన్యమంటున్న రైతులు

ఓబులవారిపల్లె, మే 16, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలో దాదాపు ఒక మండల సర్వేయర్ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయాలకు సంబంధించిన రెవెన్యూకు అనుసంధానమైన పంచాయతీ సర్వేయర్లు పదుల సంఖ్యలో ఉన్నా భూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఓబులవారిపల్లె మండలంలో తయారైంది. గత సంవత్సరాల తరబడి ఎఫ్ లైన్లు కట్టి రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ మండల సర్వేయరుగా ఉన్న ఒకరు పలుమార్లు భూ సమస్యలను పరిష్కరించి ఎఫ్ లైన్ ద్వారా భూముల కొలత వేయాలంటూ రైతులు చెప్పులు అరిగేలా తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఏదో ఒక సాకు చెబుతూ తప్పించుకు తిరుగుతుండడంతో పాటు రైతులకు అందుబాటులో లేకుండా ఎటువంటి సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత మంది రైతులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆమ్యామ్యాలు సమర్పిస్తేనే పనులు జరుగుతాయని పలువురి ప్రచారం సాగిస్తున్నారు. ఏది ఏమైనా మండలంలో భూమి కొలతలు సమస్యలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి సజావుగా సక్రమంగా అర్హులైన భూమి రైతులందరికీ భూములు సర్వే చేయించి భూ హద్దులు చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు కోరుతున్నారు. ఈవిషయంపై తహసీల్దార్ పీర్‌మున్నీని వివరణ కోరగా కొన్ని భూ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సర్వే చేసేందుకు మేము సర్వేయర్‌కు ఆదేశించడం జరిగిందన్నారు. కొన్ని రోడ్డు పనులు మంగంపేట పునరావాస పనుల వల్ల జాప్యం జరిగిందని ఇకపై జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## స్మశానవాటిక స్వాధీనానికి హైకోర్టు తీర్పు

### - ఆనందంలో లింగిరెడ్డిపల్లె గ్రామస్థులు

### - భూమిని అప్పచెబుతామంటున్న తహసీల్దార్



ఓబులవారిపల్లె, మే 16, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లె పంచాయతీలో ఉన్న లింగిరెడ్డిపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ శేషయ్య అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా స్మశాన వాటికను ఆక్రమించి అందులో మామిడిమొక్కలు నాటి ఫల సాయం పొందుతున్నారని గ్రామస్థులకు స్మశాన వాటిక అవసరమంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా హైకోర్టు జడ్జీ పరిశీలించి స్మశానాలు గ్రామస్థులకు ఎంతో అవసరమని అనుకూలంగా భూమిని గ్రామస్థులు స్వాధీనం చేసుకోవాలని తీర్పు ఇచ్చారని మంగళవారం తహసీల్దార్ పీర్‌మున్నీకి హైకోర్టు తీర్పును వినతిపత్రం రూపంలో అందజేశారు. అనంతరం ఆమె పరిశీలించి భూమిని స్వాధీనం చేసుకునేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె సూచించారు. అనంతరం గ్రామస్థులు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషకు కూడా ఒక కాపీ ఇచ్చేందుకు గ్రామస్థులు వెళ్లినట్లు శివారెడ్డి తదితరులు తెలిపారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

## మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జింకా చలపతి

**మదనపల్లె, మే 16 ప్రభాతవార్త :**



పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 11, 12వ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో మురుగునీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. అదే విధంగా రోడ్లపై చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. దోమల నివారణకు రోజూ సాయంత్రం వేళ ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. వార్డు ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా అందుబాటులో ఉండి ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

# సచివాలయ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి

**మదనపల్లె, మే 16 ప్రభాతవార్త :**



సచివాలయ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగసంఘం నాయకులు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యా లయంలో కమీషనర్ ప్రమీలకు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఉద్యోగసంఘం నాయకులు రెహమాన్, లీలావతి, విజయకుమార్ రెడ్డి, అభిషేక్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో ఉన్న సచివాలయ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేది వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో వేతనాలు కూడా మంజూ రు చేయాలన్నారు. రెండవ విడతలో నియమించబడిన సచివా లయ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయ కులు నాగరాజు, జనార్ధన్, నందిని, హరి, శరత్, రెడ్డప్ప పాల్గొన్నారు.

# సారా తయారీదారులపై ఉక్కుపాదం

## డివిజన్‌లో అక్రమ మద్యం నివారణకు ఏడు చెక్‌పోస్టులు

## మదనపల్లె డిఎస్పీ కేశప్ప

**మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త :**



సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపుతామని మదనపల్లె డిఎస్పీ కేశప్ప హెచ్చరించారు. మంగళవారం డిఎస్పీ తాలుకా పోలీస్‌స్టేషన్ లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సారా అమ్మకాల నివారణ కోసం డివిజన్ పరిధిలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్ ద్వారా ఇప్పటికే 1500 లీటర్ల సారాను సీజ్‌చేయటంతో 10వేలకు పైగా ఊటను ధ్వంసం చేయటం జరిగిందన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం అక్రమ రవాణను నిరోధించటానికి డివిజన్‌లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌ఈబి అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏవరైన సారా, కర్ణాటక మద్యం విక్రయి స్తున్నట్లు తెలిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటంతో పాటు సస్పెట్ షీట్లు తెరవటం జరుగుతుందన్నారు. రోజు సాయంత్రం పట్టణంలో డ్రంకన్ డ్రైవింగ్ టెస్టులు, పట్టణశివారులో ఓపన్ డ్రింకింగ్‌పై దాడులు నిర్వహించటం జరుగుతోందన్నారు. సారా తయారీకి ముడిసరుకులు సరఫరాచేసేవారిని గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. తాండాల్లో వారానికి ఒకసారి కార్డన్‌సర్చ్ నిర్వహించటం, నాకాబందీ ఏర్పాటు చేయటం జరుగుతోం దన్నారు. సారా, కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచా రం ఇవ్వాలన్నారు. వేసవిసెలవుల కావటంతో చాలామంది ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లటం జరుగుతోందన్నారు. దీనివల్ల దొంగతనాలు జరిగే అవకాశం వుందన్నారు. ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వేళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఊర్లకు వేళ్లేవారు తమకు సమాచారం ఇస్తే ఆ ఇంటి వద్ద గస్తీ ఏర్పాటు చేయటంతో పాటు, సిసి కెమెరాను అమర్చటం జరుగుతుం దన్నారు. దీంతో దొంగలు ఇంట్లోకి చోరబడితే వెంటనే తమకు సమాచారం వస్తుం దన్నారు.కార్యక్రమంలో తాలుకా సిఐ సత్యనారాయణ, బి.కొత్తకోట ఎస్‌ఐ రామ్మోహన్, పిటిఎం ఎస్ఐ రవీంద్రబాబు పాల్గొన్నారు.

# మిట్స్‌లో ఈఏపిసెట్ పరీక్షలు

**కురబలకోట, మే 16 ప్రభాతవార్త :**



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి కోర్స్‌ల్లో ప్రవేశాల కోసం ఈఏపిసెట్-2023 ప్రారంభించారు. ఈ కళాశాలలో సోమవారం 310మందికిగానూ 297మంది విద్యార్థులు, మంగళవారం 310మందికిగానూ 290మంది ఈ పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రెండు విడతలుగా ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా సాగుతున్నట్లు తెలిపారు.

# నిరంతర అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ : సిఐ

**మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త:**



నిరంతర అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఇందు కోసం దిశాయాప్ డౌన్‌లోడ్ల కార్యక్రమాన్ని పెంచి, నేరాలపై అవగాహన కల్పించాలని టూటౌన్ సిఐ ఎస్.మురళీక్రిష్ణ తెలిపారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మహిళా సంరక్షణ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు మహిళా పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలన్నారు. వేసవి సెలవుల్లో ఎవరైనా ఊర్లకు, టూర్లకు వెళ్ళేటప్పు విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచి వెళ్ళకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం వంటి విషయాలపై ప్రజలకు తెలపాలన్నారు. సిసికెమరాలు ప్రస్తుతం ఎక్కడెక్కడ అవసరమో, ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే విధంగా చైతన్య పరచాలన్నారు. గంజాయి, మద్యం, నాటుసారాలకు బానిసైన వ్యక్తుల సమాచారం సేకరించి వారిని డిఅడిక్షన్ సెంటర్లకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, మహిళా సంరక్షణ పోలీసులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**రామసముద్రం, మే 16 ప్రభాతవార్త :**



రామసముద్రంల మండలం లోని బ్యాడపల్లి చెక్‌పోస్టు వద్ద రవికుమార్, కట్టరవి అక్రమ మద్యం తరలిస్తుండగా ఎస్‌ఐ చంద్రశేఖర్‌కు పట్టుకొని అరెస్టు చేశారు. కుదురుచీమనపల్లెకు చెందిన వీరు ద్విచక్ర వాహనంపై అక్రమ మద్యాన్ని 120ఒరిజనల్ ఛాయిస్, 90ఎంఎల్ ప్యాకెట్లు, 44 ఓట్లు టవేరిన్ విస్కీ 180ఎంఎల్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# డెంగీ దినోత్సవంపై ర్యాలీ

**దువ్వూరు, మే 16, ప్రభాతవార్త:**



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా దువ్వూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మండల కేంద్రమైన దువ్వూరులో ర్యాలీ నిర్వహించారు. ఇందులో వైద్యాధి కారులు సమీరా, సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటు వల్ల వైరస్ ద్వారా వచ్చే వ్యాధి డెంగీ జ్వరం అని దీని పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. డెంగీ జ్వరం టైగర్ అనే దోమకాటు వల్ల వస్తుందని ఇది పగటిపూట కుడుతుందన్నారు. అందువల్ల పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ దోమ ఎక్కువగా నీటిలో ఉంటుందని అందువల్ల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డెంగీ జ్వరం వస్తే విప రీతమైన నొప్పులు, కండరాలు, అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటి లక్షణా లుంటాయన్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ర్యాలీలో చింతకుంట వైద్యాధికారి డా.వికిషిత, వైద్య సిబ్బంది శివరామయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

**దువ్వూరు, మే 16, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోందని వాటిని 1 నుంచి 10 తరగతుల విద్యార్థులు వినియోగించుకోవాలని పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా సుమారు 20 మంది విద్యార్థులకు పలువురు ఉపా ధ్యాయులు ఇంగ్లీష్, లెక్కలు సబ్జెక్టులలో పరిజ్ఞానం కల్పించారు. పిల్లలకు కథలు చెప్పడం, క్రీడల్లో ఆసక్తి కలిగించేందుకు చెస్, క్యారమ్స్ తదితర ఆటలు నేర్పిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. రోజు ఏదో ఒక కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు.

# నేడు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

**దువ్వూరు, మే 16, ప్రభాతవార్త:**

స్థానిక తెలుగు గంగ బంగ్లాలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీవో రామచంద్రారెడ్డి తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులను ఇటీవల సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందని వాటిని నివేదిక రూపంలో బహిరంగ సమావేశంలో చర్చిస్తారన్నారు. అలాగే తనిఖీలో తెలిసిన విషయాలు, ఉపాధి హామీ పనులపై ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలున్నాయి తదితర విషయాలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజలు, రైతులు, కూలీలు, సామాజిక కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

# లోకాయుక్త విచారణలో జేఎన్‌టీయూ అక్రమాలు బయట పడేనా?




**కలికిరి, మే 16, ప్రభాతవార్త:**

జేఎన్‌టీయూ అనంతపురం పరిధి లో ఉన్న కలికిరి జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణాలపై జరుపు తున్న లోకాయుక్త విచారణలో అక్ర మాలు బయట పడేనా అన్నది చర్చనీయాంశంగా మారింది. కలికిరి జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణాలు టెండర్లు కొటేషన్లు లేకుండా అయిన వారికే పనులు అప్పగించి పెద్దఎత్తున నిధులు పక్కదారి పట్టినట్లు లోకాయుక్త న్యాయమూర్తికి ఫిర్యాదులు అందాయి. దీంతో జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణ పనులపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఉన్నత విద్యా మండలికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో చేపట్టిన పనులు నిధుల కేటాయింపులు తదితర అంశాలపై ఉన్నత విద్యా మండలి అధికారులు నివేదికలు సిద్ధం చేసే పనులలో పడ్డారు. కళాశాల భవన నిర్మాణాలకు రూ. 295.15 కోట్లు కేటాయించగా ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల బాధ్యతలు ఒక ఏజెన్సీకి అప్పగించాలని నిర్ణయించారు. ఈ ఏజెన్సీ నుంచి మరో కాంట్రాక్ట్ సంస్థకు పనులు అప్పగించారు. పనుల పర్యవేక్షణకు నోడల్ కమిటీని నియామకం చేశారు. అయితే నోడల్ కమిటీ పరిధి దాటి వ్యవహరించింది. కాంట్రాక్టు సంస్థకు ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించేలా సిఫార్సులు చేసింది. ఒప్పందం ప్రకారం రూ.295.15 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉండగా ఏకంగా రూ.375.46 కోట్లు చెల్లించేశారు. పాలక మండలి ఆమోదం లేకుండానే రూ.80.31 కోట్లు అదనంగా చెల్లించడం వివాదాస్పదమైంది. ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలలో అక్రమాలు తేల్చాలని విజిలెన్స్ అధికారులు 2020 జనవరి 24న నోటీసులు జారీ చేశారు. అయితే గడువు ముగిసే లోపే వివరాలు ఏమీ అవసరం లేదని విజిలెన్స్ అధికారులు మౌకికంగా యూనివర్శిటీ అధికారులకు తెలిపారు. దీంతో దర్యాప్తు ఆగిపోయింది. ఇటీవల లోకాయుక్తలో విద్యార్థి జయపాల్‌రెడ్డి అక్రమా లపై ఫిర్యాదు చేయడంతో విచారణ వేగవంతంగా జరుగుతోంది. లోకాయుక్త విచారణపై ప్రభాతవార్త మంగళవారం ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణను వివ రణ కోరగా లోకాయుక్త విచారణ అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలోనే జరుగుతోందని జేఎన్‌టీయూ కళాశాల భవనాల నిర్మాణాలపై తమకు అవగాహన కూడా లేదని ఆయన ప్రభాతవార్తకు వివరించారు. ఏదిఏమైనప్పటికీ జేఎన్ టీయూ కళాశాల భవన నిర్మాణాలపై లోకాయుక్త విచారణ చేపడుతుండడంతో అటు అప్పటి అధికారులకు, ప్రస్తుత అధికారులలో సైతం ఆందోళన మొదలైంది.

# బటన్‌నొక్కే ముఖ్యమంత్రికి రోజులు దగ్గర పడ్డాయి

## జనసేన నాయకులు రాందాస్‌చౌదరి

**మదనపల్లె, మే 16 ప్రభాతవార్త :**



బటన్‌నొక్కే ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని జనసేన రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మగతనం అంటే మాట నిలబెట్టుకోవడమని, అభివృద్ధి విషయంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన మాట, హామీలు నిలబెట్టకోవడంలో విఫలం చెందిందన్నారు. జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబీకుల అరాచకాలకు ముగింపు పలికే సమయం ఆసన మైందన్నారు. ప్రజలు మెచ్చే, ప్రజలకు నచ్చేలా త్వరలోనే పవన్‌కళ్యాణ్ పాలన వస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెలుతా మన్నారు. రాష్టంలో ప్రజలు మార్పు కోరేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్‌రాయల్, చేనేత విభాగం నాయకులు అడపా సురేంద్ర, రూరల్ అధ్యక్షులు గ్రానైట్‌బాబు, జగదీష్, జనార్ధన్, లక్ష్మీపతి, పద్మావతి, శేఖర్, కుమార్, స్వాతి, శంకరా పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం

**కురబలకోట, మే 16 ప్రభాతవార్త :**

కురబలకోట మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, జడ్పిటిసిలు, కోఆప్షన్‌సభ్యులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

# కార్మిక సోదరులారా మీకు జోహార్లు..!

**బి.కొత్తకోట, మే 16, ప్రభాతవార్త:**



బి.కొత్తకోట మండల కేంద్రం నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నిత్యం తమ పని చేసుకుంటూ పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్న వారికి జోహార్లు అంటూ స్థానిక ప్రజలు ప్రశంసించడం విశేషం. నగర పంచాయతీలో నిత్యం పారిశుద్ధ్య సమస్యలతో దోమలు ఉద్భతమై అనారోగ్యానికి కారణంగా నిలుస్తున్నాయి. ఈ సమస్యపై నగర పంచాయతీ అధికారి రమాదేవి ముందస్తుగా బి.కొత్తకోటలోని ప్రధాన వీధులు, రహదారులు అక్కడికి పారిశుద్ధ్య సమస్యలపై ఆరాతీసి సమస్యల పరిష్కారానికి మురికి నీటి కాలువలు శుభ్రం, వీధుల్లోని చెత్తా చెదారం తొలగించడానికి ఓ ప్రణాళికా ప్రకారం ఆదేశాలు జారీ చేశారు. నగర పంచాయతీలోని సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆమె పారిశుద్ధ్యం ఆవశ్యకత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా, సుఖ శాంతులతో ఉంటారని హితబోధ చేశారు. బి.కొత్తకోట నగర పంచాయతీలోని ప్రతి వీధిలో చెత్తాచెదారం పూర్తిగా తొలగించి మురికి నీటి కాలువలు శుభ్రం చేసి పారిశుద్ధ్యానికి తమ వంతు బాధ్యతగా పెద్దపీట వేయడంతో స్థానిక ప్రజలు నగర పంచాయతీ అధికారి రమాదేవి కార్యదీక్ష, పట్టుదల కార్మికులకు చేసిన ఉపదేశంతో నగర పంచాయతీ అధికారి రమాదేవితో పాటు పారిశుద్ధ్య కార్మికుల పట్ల బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## - డీపీఎంవో డా.లోకవర్ధన్

**కలికిరి, మే 16, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కోసం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నమయ్య డీపీఎంవో డా.లోకవర్ధన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళ వారం కలికిరి గిరిజన కాలనీలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమా న్ని డీపీఎంవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని కావ్య గంద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# నేడు వైభవంగా కోటకొండ గంగమ్మ జాతర

**తంబళ్లపల్లె, మే 16, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలం పరసతోపు పంచాయతీ పరిధిలోని కోటకొండ గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరుగనుందని సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సరోజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట కొండ గంగమ్మకు బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీలు బాణాలు అమ్మవారికి సమర్పిస్తారని ఆయన తెలిపారు. గత 4 రోజులుగా కోటకొండ గంగమ్మ తల్లిని పరసుతోపు, తంబళ్లపల్లె పంచాయతీలలోని అన్ని గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణాసంచాతో పాటు ప్రత్యేక వాయిద్యాల బృందాలు అలరించాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు, సహస్ర నామార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు గ్రామాల నుంచి చాందినీ బండ్ల ఊరేగింపు, కోలాటాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి వాయిద్యాలు ఏర్పాటు చేస్తున్నారు. కోటకొండ గంగమ్మ ఆలయం విద్యుత్తు దీపాలతో అలంకరణలు అలరిస్తున్నాయి. ఈ జాతరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దంపతులతో పాటు మండలంలోని వైకాపా నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# ప్రాణాంతకమైన డెంగీపై తస్మాత్ జాగ్రత్త

**తంబళ్లపల్లె, మే 16, ప్రభాతవార్త:**



రోగుల పట్ల ప్రాణాంతకంగా తయారైన డెంగీ వైరస్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ ఈవో వెంకట రమణ సూచించారు. మంగళవారం కోసువారి పల్లె జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ లక్షణాలను వివరించారు. ఆకస్మిక జ్వరం, తలనొప్పి, విపరీతమైన కీళ్లు, కండరాలు, కళ్ల నొప్పులు, కంటి కదలికల తగ్గడం, ఒంటిపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, అధిక దాహం ఉంటే డెంగీ సోకినట్లేనన్నారు. డెంగీ నివారణకు ఇంటి లోపల బయట నీళ్ల నిలువ లేకుండా చూసి పాత్రలపై మూత లు వేయాలన్నారు. నీటి కుంటలు, చెరువులు, బావుల్లో ప్రభుత్వ యంత్రాంగం తో గంబూసియా చేపలను వేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుద్ధత పాటించి దోమకాటుకు దూరంగా ఉండి దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ లలితమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జాకీర్, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు, అలీమా, రామలక్ష్మీ, తులసి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలి

## డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

**బద్వేలు అర్బన్ మే 16 ప్రభాతవార్త :**



డివైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు జూన్ 2,3,4 న విశాఖపట్నం నందు జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక సుందరయ్య భవనం నందు కరపత్రాలు ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.... డివైఎఫ్‌ఐ యువజన సంఘం నిరుద్యోగ యువతి యువకుల సమస్యల పై కేంద్రంలో రాష్ట్రంలో నిరంతరం పోరాటాలు సాగిస్తున్నాది అన్నారు.ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికీ ప్రభుత్వ శాఖ లలో ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు అన్నారు.రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ లేదు అన్నారు.(గ్రూప్స్,డిఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు అన్నారు.రాష్ట్రానికి ప్రత్యేక హెూదా,విభజన హామీలు,కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీలు అమలు కేంద్ర ప్రభుత్వం ఒక్కటి అమలు చేయలేదు అన్నారు.వీటి అమలు కోసం డివైఎఫ్‌ఐ యువజన సంఘం భవిష్యత్ లో పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు ఈ రాష్ట్ర శిక్షణ తరగతులలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి విధానాలు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఈ క్లాసులలో చర్చిస్తామని అందుకు యువతి యువకులు ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు గంగనపల్లి నాగార్జున, ఎస్ ప్రవీణ్ కుమార్, జివి రమణారెడ్డి, మహిళా కన్వీనర్ సి గురుదేవి, కోకన్వీనర్ టీ నాగేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది అత్యవసర కేసులపై దృష్టి సారించండి

## - డీసీహెచ్ఓ చంద్రశేఖర్



**తంబళ్లపల్లె, మే 16, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే అత్యవసర కేసులపై దృష్టి సారించి సకాలంలో వైద్యంఅందించాలని అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఆయన తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎక్స్‌రే యూనిట్, రక్త పరీక్షల యూనిట్, ఆసుపత్రి వార్డులను పరిశీలించారు. ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజు ఓపీ రోగులు ఎక్కువగా వస్తున్నారని డాక్టర్లు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే అత్యవసర కేసులపై వైద్యం అందించాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని మొత్తం సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి హాజరు కావాలని లేదంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన ఓపీ రోగులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారు నర్సులు, ఇక్కడ పని చేసే సిబ్బంది ఇంకా బాగా చూసుకుంటున్నారని చెప్పడంతో డీసీహెచ్ఓ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆసియా, బాబాఫక్రుద్దీన్, ఐసటీసీ కౌన్సిలర్ చందు, బాలా జీ, నర్సులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# సమ్మర్‌క్యాంపులో వేమన శతక ప్రశంస

**ప్రొద్దుటూరు మే 16, ప్రభాతవార్త**



పౌరగ్రంథాలయ శాఖ ఆదేశాలమేరకు రామేశ్వరం బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలు నందు నిర్వహించిన సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం 36 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విశ్రాంత తెలుగు పండితులు వి.యం. భాస్కర్ రాజు విద్యార్థులకు వేమన శతక పద్యాలను వాటి తాత్పర్యాలను విపులంగా వివరించారు. తెలుగులో ఉన్నన్ని శతకాలు పర భాషలోను లేవన్నారు. ముఖ్యంగా 'వేమనశతకం' ప్రాధాన్యత ప్రత్యేకం విదేశీ భాషల్లోకి ఫ్రెంచి లాటిన్, ఇంగ్లీషు భాషల్లోకి అనువదింంబడుట వేమన ప్రాశస్త్యం తేటతెల్లమని, నిజంగా వాడుక పదాలలో లోక విషయాలను వ్యక్తం చేసినకవి వేమన అని అందుకే వేమన ప్రజాకవిగా రాణించారన్నారు. యోగివేమన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. యోగా టీచర్లు శ్రావణి, వెంకట సుబ్బమ్మ విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. అరవింద్ తేజస్సులు చెస్ క్రీడా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అని స్టెంట్ ఇబ్రాయు సాహెబ్ హైస్కూలు సిబ్బంది ఓబులేసు రెహ్మాన్ ఖాన్, శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పగటి కలలు కంటున్నావా ప్రవీణ్

## కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

**ప్రొద్దుటూరు మే 16, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రాబోవు సార్వత్రిక ఎన్నికల లో విజయం సాధించి టిడిపి జెండా ఎగరవేస్తానని టిడిపి ఇన్చార్జ్ పగటి కలలు కంటు న్నారని, ముందుగా టిడిపి అభ్యర్థిత్వాన్ని అమ్ముకోకుండా కాపాడుకోవాలని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం చేపట్టిన పాదయాత్రలో టిడిపి ఇన్చార్జి ప్రవీణ్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన విరుచక పడ్డారు. మున్సిపల్ ఎన్నికలలో తన సొంత వార్డును గెలిపించుకోలేని టిడిపి ఇన్చార్జి ప్రవీణ్ ఎమ్మెల్యే రాచమల్లును ఓడించి మాజీని చేస్తానని ప్రగల్బాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కుటుంబం పోటీలో ఉన్నంతకాలం టిడిపికి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. టిడిపి అభ్యర్థిత్వాన్ని ఐదు కోట్లకు ప్రవీణ్ అమ్ముకుంటున్నారని పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతోందని ఎద్దేవా చేశారు. ప్రొద్దు టూరు టిడిపి అభ్యర్థి రేసులో ఉన్న ఏడు మంది టిడిపి నాయకులు కలిసి వచ్చినా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అఖండ విజయం సాధించి తమ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వైసీపీ జెండా ఎగరవేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ముందుగా ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు మేలు చేసి వారి అభిమా నాన్ని ఆయన హితవుపలికారు.

# ప్రభుత్వ విధానాలు మార్పులు రైతుల పట్ల ఆత్మహత్యలు



**లక్కిరెడ్డిపల్లె, మే 16, ప్రభాతవార్త:**

ప్రభుత్వ విధానాల మార్పుల వల్ల రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారని అన్నమయ్య జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని 2016 నుంచి 2021 వరకు మధ్యదేశంలో 6422 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు నేషనల్ క్రైం రికార్డు బ్యూరోలో వెల్లడైందన్నారు. ప్రభుత్వ రుణ సదుపాయం తగ్గిపోవడం సహకార వ్యవస్థ పూర్తిగా మూతపడడం ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు విధానాలు విద్యుత్తు చట్టాలు రైతాంగాన్ని ముంచేస్తున్నాయని ఆయన అన్నారు. రెండు సంవత్సరాలు అధిక వర్షాల వల్ల రాష్ట్రంలో 14 జిల్లాలో కోట్ల రూపాయలు రైతులు పెట్టుబడులు మట్టి పాలు అయ్యాయని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొనసాని రాజారెడ్డి రైతులు గంగయ్య, సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

# విజయవంతంగా జేవీవీ వేసవి వినోద శిబిరం

**కడప వైద్యవిభాగ, మే 16, ప్రభాతవార్త:**



కడప నగరం రవీంద్రనగర్‌లో ఉన్న విద్యానికేతన్ పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి బాలల వేసవి వినోద, విద్య, నృత్య శిబిరాలను విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. మన దగ్గర ఉన్న కలర్ పేపర్లతో ఎంతో అందమైన రోజా పువ్వులు తయారు చేయవచ్చు అని జేవీవీ రాష్ట్ర సాంస్కృతిక నాయకులు రంగనాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, విద్యానికేతన్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు స్వర్ణలత, శ్రీను, సత్యం, చంద్రకళ, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవం

బ్రహ్మంగారి మఠం, మే 16 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలో, పలుగురాళ్ళపల్లె ప్రాథమిక వైద్యశాల నందు జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వేర్వేరుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ దినోత్సవం సందర్భంగా బి.మఠం వైద్యాధికారి పలనిరాజ్, పలుగురాళ్ళపల్లె వైద్యాధికారి చెన్నకేశవరావు ఇరువురూ మాట్లాడుతూ దోమకాటు వలన డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని, వాటి వల్ల జరిగే నష్టాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, ఎక్కువగా మురికి నీరు ఇంటి పరిసరాలలో నిలువ ఉండకుండా చూసుకోవడంతో పాటు పడవేసిన కొబ్బరి బోండాలను, పాత టైర్లను, తడి చెత్త, పొడి చెత్తను ఇంటి పరిసర ప్రాంతాలలో ఉంచుకుంటే దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ బారి నుండి కాపాడుకోవచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఝాన్సీ, సిహెచ్‌వో సాంబశివారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో పీరయ్య, సూపర్‌వైజర్ పుష్పరాజు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందుతుంది

– వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల పాలిట వరం

– ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి వెల్లడి



సంబేపల్లె, మే 16, ప్రభాతవార్త:

వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందుతుందని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఏపీ పౌర గ్రంథాలయ శాఖ వారి ఆధ్వర్యంలో మే నెల 8వ తేదీ నుంచి జూన్ 11 వరకు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరంలో చేతి వ్రాత, ఇంగ్లీష్, తెలుగు గ్రామర్, నీతి కథలు చెప్పడం, బొమ్మలు గీయడం, కాగితంతో ఆట వస్తువుల తయారీ, యోగా, ధ్యానం వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కృత్యాధార బోధన ద్వారా నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన శిక్షణ విద్యార్థులకు ఉత్సాహాన్ని, వినోదాన్ని, సృజనాత్మక ఆలోచనలను కలగజేస్తుందన్నారు. వేసవి కాలంలో నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబేపల్లె గ్రంథాలయ శాఖ నిర్వాహకులు రెడ్డి శేఖర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు అల్లరి చిల్లరిగా తిరగకుండా ఎండ వేడిమికి గురికాకుండా ఉండేందుకు పాఠశాలలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని అనంతరం విద్యార్థులందరికీ నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోషఫ్, ఆంజనేయులు, ఉపాధ్యాయినీ శశికళ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణమోహన్‌కు అప్కాస్ సిబ్బంది ఘనసన్మానం

నందలూరు, మే 16 ప్రభాతవార్త



మహాత్మాజ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ప్రైవేటి ఏజెన్సీ కింద సుమారు 1450 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తూ సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడేవారు. దీనికి ఆ సంస్థ కార్యదర్శి ఆకేపాటి కృష్ణమోహన్ ఒక్కసారిగా అందరిని అప్కాస్ నందు చర్చల కృషి చేసి అందరిని ఒకసారి అప్కాస్‌లో చేర్చారు. ఇందుకుగాను మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరి, పాత కడప జిల్లా అధ్యక్షులు ఎ.ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రసాదయ్య, కడప, కర్నూలు, నెల్లూరు, అమలాపురం పాఠశాల సిబ్బంది సహకారంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థలు, డిప్యూటీ సెక్రటరి సుభాషిణి దేవమ్మ, సంఘ గౌరవాధ్యక్షులు శివకాంత్, అధ్యక్షులు మనోహర్‌నాయుడు, జనరల్ సెక్రటరి కృష్ణమోహన్, టివి రమణ, ఉపాధ్యక్షులు సిద్ధలింగప్ప, కోశాధికారి రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రమేష్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## దోమలపై దండయాత్ర : పుల ంపేటలో ర్యాలీ

పుల్లంపేట, మే 16 ప్రభాతవార్త



జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ఆరోగ్య కేం ద్రం నందు ర్యాలీ కార్యక్రమా న్ని వైద్యాధికారి శేఖర్ ఆధ్వ ర్యంలో మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శేఖర్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఆర్బో వైరస్ వ్యాధికి చెందిన దని, 4 రకాల డెంగ్యూ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి వస్తుందని, మనిషి నుండి మనిషికి దోమల ద్వారా సంక్రమిస్తుందని అన్నారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణంలో ఉంటాయని, పగటిపూట మాత్రమే కుడతాయని పేర్కొన్నారు. ఆకస్మికంగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్లువా పులు శరీరంపై ఎర్రటి దద్దులు, అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటి లక్షలణాలు అన్నారు. దీని నివారణోపాయాలు ఇంటిలోపల, బయట ఆవరణలో నీరు నిల్వ లేకుండా ఉండడం, పాతటైర్లు, కొబ్బరి బోండాలు, సంప్‌లు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాల న్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా పాటించాలన్నారు. పుల్లంపేట పురవీధు ల్లో దోమకాటు ఆరోగ్యానికి చేటు, దోమలు కొట్టకుండా, కుట్టకుండా చూద్దాం, దోమలపై దండయాత్ర చేద్దాం, ఆరోగ్యంపై జైత్రయాత్ర అనేనినాదంతో స్థానిక సిబ్బంది, ఆశా కార్యకర్తలతో

## ఆంజనేయ స్వామికి విశేష పూజలు

బద్వేలు అర్బన్, మే 16 ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సింధూరం అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక ఉభయదాతలుగా తులసి వెంకట శివ నారాయణ, సతీమణి ఇందుమతి, మదళ్ళపల్లె వెంకటసుబ్బయ్య, సతీమణి గంగా శాలినితో పాటు చెక్కా సుధాకర్, సతీమణి లక్ష్మీ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు.

## వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ చెన్నకేశవ

నందలూరు, మే 16 ప్రభాతవార్త



నందలూరు మండలానికి వచ్చిన కొత్త ఎస్ఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో కడప – రేణిగుంట హైవే రహదారిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సంబంధిత పత్రాలు, హెల్మెంట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు వాడాలని, ప్రమాద రహిత ప్రయాణం చేయాలని వాహనదారులకు సూచనలు, సలహాలిచ్చారు. ఎవరైనా అలా కాదని నియమాలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రవాణా వాహనాల త్రైమాసిక పన్ను పెంపు గర్హనీయం

వేంపల్లె, మే 15, ప్రభాతవార్త ః



రవాణా వాహనాల త్రైమాసిక పన్నును ఒకేసారి 25శాతం పెంచుతూ వైకాపా ప్రభుత్వం ఈనెల 12న జీవోనెం.31 జారీ చేయడం గర్హనీయమని ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం వడ్డింపులు, వాయింపుల ప్రభుత్వంగా తయారైందన్నారు. జగన్ పాలనలో రవాణా రంగం ఇప్పటికే కుదేలైందన్నారు. రవాణా వాహనాలపై పన్ను పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఇప్పటికే 30శాతం అధికంగా ఉందన్నారు. ప్రజా వ్యతిరేక జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## డెంగీ నివారణ మనందరి బాధ్యత

– సమర్థవంతమైన సహజ భాగస్వామ్యంతో డెంగీ నివారిద్దాం

లక్కిరెడ్డిపల్లె, మే 16, ప్రభాతవార్త:



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా చింతకుంటవాండ్లపల్లి, కోనంపేటలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు డెంగీ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, డా.సిద్దయ్య మాట్లాడుతూ ఆర్బో డెంగీ వైరస్ వలన ఎడిస్ ఈజిప్ట్ టైగర్ దోమ ద్వారా ఒకరి నుంచి ఒకరికి డెంగీ జ్వరం వస్తుందని డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

### డెంగీ జ్వరం లక్షణాలు :

ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతంగా కండరాల నొప్పి, కీళ్ల నొప్పి ఉంటాయి. కళ్ల నొప్పులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం, అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. పై లక్షణాలు ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో డెంగీ రాపిడ్ పరీక్షలు చేస్తారు. ప్లేట్‌లెట్స్ తగ్గితే వెంటనే హాస్పిటల్ చికిత్స అవసరం.

డెంగీ నివారణ.. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి. ఫ్రైడే డ్రై డే పాటించాలి. టైగర్ దోమ పగటి పూట కుడుతుంది. మంచినీటిలో దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కూలర్లు, ఫ్రిడ్జ్, పూలకుండీలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, నీరు నిల్వ ఉండే వస్తువులు నీటి నిల్వలు తొలగించాలి. ఈ కార్యక్రమంలో డా.సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ యాదవ్, సీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్‌వైజర్ ఎం.సురేంద్రారెడ్డి, సతీష్, శివ, చంద్ర, రవికుమార్, రమణ, వైద్యసిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## డెంగ్యూ దినోత్సవంపై ర్యాలీ

రామాపురం, మే 16ప్రభాతవార్త:



జాతీయ డెంగ్యూ దినోత్సవంపై మండల కేంద్రంలో మండల వైద్యాధికారులు విజయకుమార్, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మూడు రోడ్ల కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైరల్ ఫీవర్ బారిన పడకుండా ప్రజల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నినాదాలు చేశారు. డాక్టర్లు మాట్లాడూతూ డెంగ్యూ వ్యాధి వైరస్‌ను మే 16న కనుక్కోవడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో సిహెచ్‌వో ఏలియజేర్ పిహిచ్ఎన్. విజయకుమారి హెల్త్ సూపర్వైజర్లు రాఘవేంద్రరాజు, ఉమామహేశ్వరి, ఎంఎల్‌పిలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పూరిళ్లు దగ్ధం – పరిశీలించిన అధికారులు

ఓబులవారిపల్లె, మే 16, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం జి.కొత్తపల్లె గ్రామానికి చెందిన పోలి శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన పూరిళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో వీఆర్వో వెంకట కృష్ణయ్య మంగళవారం పరిశీలించి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం అందిస్తామన్నారు. అంతేకాకుండా ఇంటిలోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయిందని ఇది ప్రమాదమా లేక వ్యక్తిగతంలో ఎవరైనా నిప్పు పెట్టారా అని తెలియడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే పేదరికానికి ఇంకా ఎక్కువ కష్టం వచ్చేలా ఇల్లు కాలిపోవడంతో తీవ్ర వేదనకు గురైనట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాల ని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకట కృష్ణయ్య గ్రామ నాయకులు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పులివెందుల అభివృద్ధి బీటెక్ రవికి కనపడలేదా?

– విమర్శలు చేసేటప్పుడు స్థాయి ఏంటో తెలుసుకోవాలి



పులివెందుల, మే 15, ప్రభాతవార్త ః

పులివెందుల ప్రజల బ్రతుకులు బానిస బ్రతుకులు అనే స్థాయి బీటెక్ రవికి కానీ, టీడీపీకి కానీ లేదని, నీ రాజకీయం కోసం పులివెందుల ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ హాఫీజ్, మార్కెట్ కమిటి వైస్‌ఛైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా దానికి పులివెందుల గుండాలు, రౌడీలు కారణం అని అవమానిస్తూ పులివెందుల ప్రజలను అప్రతిష్ట పాలు చేస్తున్నావని బీటెక్ రవిపై మండిపడ్డారు. పులివెందులను ఒక మోడల్‌సిటీ తరహా అభివృద్ధి చేయాలనుకుంటున్నారని, అన్ని సాక్ష్యాలతో బహిరంగ చర్చకు సిద్ధం.. దమ్ముంటే సవాలు స్వీకరించాలని వారు డిమాండ్ చేశారు. వైఎస్ కుటుంబంపై ప్రగాఢ విశ్వాసం, నమ్మకం ప్రజలకు ఉన్నాయ న్నారు. గతంలో కంటే బంపర్ మెజార్టీతో గెలవడం ఖాయం అని వారు అన్నా రు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, అంకాలమ్మ దేవస్థాన ఛైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిషోర్, సోఫాలవీరా, రాజేష్, నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చుటకు మజ్జిగ వితరణ

బద్వేలు అర్బన్, మే 16 ప్రభాతవార్త :



రోజు రోజుకూ అధికంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉదయం 11 గంటల నుండే ప్రజలు బయటికి రావాలంటేనే ఎండల తీవ్రతతో అనేక ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కీ॥శే॥ సముద్రాల సీతారామయ్య, వారి భార్య కీ॥శే॥ రాజేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమారుడు, భరత్ మొబైల్స్ సముద్రాల భరత్ కుటుంబ సభ్యులు మంగళవారం సుమారు 300 మందికి మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, ముచ్చర్ల సత్యనారాయణ, మదళ్ళపల్లె వాసు, మొబైల్స్ షాపు అసోషియేషన్ కనమర్లపూటి మస్తాన్ రాజా, వల్లంకొండు శివ కుమార్ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్నందున వివిధ పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుండి పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చుట కొరకు మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. పలువురు దాతలు ముందుకొచ్చి సహృదయంతో ప్రజల దాహార్తిని తీర్చుట కొరకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో చుండూరు సురేంద్ర, పెనల సుధాకర్, ఉరిమి నాగేంద్ర, కనమర్లపూటి నాగేంద్ర, మున్సిపల్ సిబ్బంది సుబ్రమణ్యంతో పాటు పలువురు మొబైల్స్ షాప్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి నివారణకు కృషి చేయాలి

– డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి



బద్వేలు అర్బన్, మే 16 ప్రభాతవార్త :

డెంగ్యూ వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జాతీయ డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఇన్‌ఫెక్టెడ్ టైగర్ దోమ ద్వారా ఒకరి నుండి ఒకరికి వ్యాప్తి చెందుతుందని, ప్రజలకు అవగాహన కల్పించి దోమల నివారణ కొరకు నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఇంటిలోని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. అనంతరం వైద్యాధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, అప్పుడే వ్యాధులు దరి చేరవన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్న చోట లార్వా నివారణ కొరకు అబేట్ ద్రావణం పిచికారి చేయాలని తెలియజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. మండలంలో డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం డెంగ్యూ వ్యాధిపై డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, శ్రీరాములయ్య, ఖాసిం, సిహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిరిగేపల్లెలో ఘనంగా రామాలయ వార్షికోత్సవం

కొండాపురం, మే 15, ప్రభాతవార్త ః

కొండాపురం మండలంలోని సిరిగేపల్లెలో రామాలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భాగవత పఠనం నిర్వహించారు. అలాగే గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి, ప్రవల్లిక అనే భక్తులు ఆలయానికి మకర తోరణాన్ని విరాళంగా ఇచ్చారు. పంచలోహాలతో తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. దీనికి సుమారు రూ.20వేలు ఖర్చు అయిందన్నారు.

## మోసగించి తీసుకెళ్లారు.. తిరిగి ఇవ్వనన్నారు

కన్నతల్లికి కడుపుకోత : పెంపుడు తల్లిది వ్యతిరేకం బాట

రాజంపేట, మే 16 ప్రభాతవార్త



ఒక తల్లి ప్రాణాన్ని అన్యం, పున్నెం ఎరుగని పదిరోజులు నిండని పసికందు కాపాడాడు. ఐతే ఇది నిజమని నమ్ముతారా, ఎక్కడైనా చూసి ఉంటారా, లేకపోతే వినుంటారా, ఇవి రెండు జరిగిండవ్, అలాగే చూసి కూడా ఉండరు. కడప నగరంలోని తిలక్ నగరంలో ఓ దళిత కులానికి చెందిన పెద్దకత్తుల కొండమ్మ, సౌందర్య బాబులకు ఇద్దరు కూతుళ్ళ తర్వాత పుట్టిన మగ సంతానం పాపం ఇద్దరు ఆడపిల్లలు తర్వాత మగ పిల్లాడు పుట్టడంతో తల్లి తండ్రి లైన కొండమ్మ, సౌందర్య బాబుల ఆనందానికి అవదులేకుండా పోయాయి. పదకొండు రోజుల ఆపసికందును తల్లి నుంచి వేరు చేసేందుకు రైల్వే కోడూరు నుంచి మాతల్లి బిడ్డలను విడదీసే మోసగాలైన రాబంధులు గుంపు వచ్చి తల్లి బిడ్డలను వేరు విడదీశారని ఆమె రోదిస్తున్న రోధనతో కూడిన అతల్లి కడుపు కోత ఆవేదన చూస్తే ఎటువంటి కఠినమైన మసున్న వారి గుండెకూడా పగలి పోతుంది. కడుపు కోతతో గత ఏడేళ్లుగా ఆతల్లి ఆవేదన ఇలా ఉంది పదకొండవరోజు ఉదయం స్నానం చేయించి నా బిడ్డ నందకిశోర్ ను ఊయాలలోవేసి నిద్ర పించాను అదే సమయానికి ఎవరిని అడిగారో ఎలా తెలుసు కున్నారో తెలియదు గాని ఆరు మంది మగవాళ్ళు ఒక ఆడమనిషి వచ్చారు. మభర్త ను అడిగారు. ఆయన అరగంట వస్తే అంత వరకు వున్నారు. ఆయన రాగానే వచ్చిన ఇద్దరు మాయిద్దరి కాళ్ళ పై పడ్డారు. మాది నెల్లూరు మాకూతురు కాన్పు అయ్యింది కొడుకు చనిపోయాడు. ఈవిషయం తెలియగానే తల్లి కోమాలోకి పోయింది. డాక్టర్ ఎక్కడైనా ఒక బిడ్డను తెచ్చి పెట్టండి. స్పృహ లోకి వస్తానే వాళ్ళ బిడ్డను వాళ్లకు ఇచ్చేయమని చెప్పారు. ఎక్కడ బిడ్డ దొరకలేదు. మీబిడ్డను ఒక్కరోజు ఇస్తే మా అమ్మాయి బ్రతుకుతుంది. మీకు కావాలంటే ఎంతైనా ఇస్తామని బ్రతిమల్లాడి లక్ష రూపాయలు డబ్బులు ఇచ్చారు. ఒకపసికందు తో ఒతల్లి ప్రాణం వస్తుందని నమ్మి ఇచ్చామన్నారు. వాళ్లవెంట మాభర్తను కూడా పంపాను. ఆ వచ్చిన వాళ్ల జంగిట శుభద్ర, నరసింహులు, ఇరగన బోయిన చిన్న సుబ్బరాయుడు, సురేష్, ఆనంద బాబులు కలిసి మాభర్త ను పక్కకు తీసుకెళ్లి బిడ్డను ఎత్తుకొని వెళ్లి పోయారు. ఈరోజు, రేపు అంటూ సుమారు మూడేళ్లు గడిచింది. ఆతరు వాత ఆనంద్ బాబు ద్వారా మాబిడ్డ కోడూరులో సుభద్రమ్మ, నరసింహులు వద్ద ఉన్నట్లు తెలిపారు. ఇది తెలుసు కొని మేము వాళ్ళ ఇంటికి వెళ్లి మాబిడ్డను ఇవ్వమని అడిగితే, మీదే కులం, మాది ఏ కులం మీ మాదిగ కులం బిడ్డను మేము తగులుతాము. ఏమను కుంటున్నారు. మాదిగలంజ ఇక్కడ నుంచి పోతారా, పోలీసులు కుచెప్పి విరగొట్టియ్యాలా అని నన్ను, నాభర్త ను మెడ పట్టుకొని దొబ్బారు.మేము అక్కడ నుంచి రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ కు వెళ్లి పిర్యాదు చేశాము. వాళ్ల వాళ్ళ మాటలు నమ్మి వాళ్ల వద్ద లంచాలు తీసుకొని బిడ్డను కోల్పోయిన తల్లి అనిగాని మహిళా అనిగాని చూడకుండా అతి దారుణంగా చితక బాధారు. గత మూడు సంవత్సరంలు గా తిరుగుతున్నాం పట్టించు కోలేదని సోమవారం అమహిళ రాజంపేట వార్త కార్యాల యం వద్ద విలపించింది. నన్ను మోసగించి నాబిడ్డను తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకొని నాబిడ్డను ఇప్పించి న్యాయం చేయాలని కొరింది.

## మండల అభివృద్ధికి సహకరించాలి

– ఎంపిపి సుధామాధురి



చిన్నమండెం, మే 16ప్రభాతవార్త:

చిన్నమండెం మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎంపిపి సుధామాధురి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడివో రహీమ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి సుధామాధురి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ పథకాలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో మండల వ్యాప్తంగా అమలవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జడీ ్ప మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డిల కృషితో మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఎంపిడివో రహీం మాట్లాడుతూ ప్రతి సచివాలయం లో ప్రతి అధికారి అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నా రు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ హరినాథరెడ్డి మాట్లాడుతూ నీటి సమస్య లేకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి జేజేఎంకింద నీటి కుళాయి మంజూరయ్యాయని పనులు జరుగుతున్నాయన్నారు. హౌసింగ్ ఏఈ రాజేశ్వరి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1.185 మంది లబ్దిదారులకు ఇళ్లు మంజూరు కాగా 363మంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ అలీఖాన్, కోప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపిటిసిలు శ్యామ్‌చం ద్ర, వెంకట ప్పనాయుడు రమేష్, తులశమ్మ, రత్నమ్మ, సర్పంచ్‌లు ముసల్‌రెడ్డి, లక్ష్మీదేవి, నజీర్ అహమ్మద్, నజీర్ బాషా, లోకేశ్వర్‌రెడ్డి, ఆఫ్రోజ్, దామోదర్, కళ్ల రమణ, వెలుగు ఎపిఎం

## క్రికెట్ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేయండి

– అత్యంత సుందరంగా క్రికెట్ స్టేడియం పనులు చేపట్టాలి



రాయచోటి, మే 15, ప్రభాతవార్త ః

క్రికెట్ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శివారు ప్రాంతమైన నక్కాలవాండ్లపల్లె సమీపంలో క్రికెట్ స్టేడియం భూమి చదును పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. మట్టి చదును పనులను పరిశీలించి క్రికెట్ మైదానంలో పిచ్ ఎక్కడ వస్తుంది వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్ కూడా వేయాలని సూచించారు. స్టేడియం ఫెన్సింగ్ పనులు కూడా త్వరగా మొదలుపెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేసే పనులన్నీ నాణ్యతతో శాశ్వతంగా ఉండేలా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. స్టేడియంకు వచ్చేందుకు సమీపంలోని ప్రధాన రహదారినీ కలిపేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. భూమి చదును పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇంచార్జి ఎస్ ఈ సహదేవ రెడ్డి, డిఈ సురేష్ నాయక్, మున్సిపల్ కమిషనర్ గంగాధరరావు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రాజంపేట అర్బన్, మే 16 ప్రభాతవార్త

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాంతకమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు మున్సిపాలిటి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ప్రబలుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శేషఫణి, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైందవ పురుషుల ఆస్థికి వారసత్వ నిర్ణయం

బద్వేలు లీగల్, మే 16 ప్రభాతవార్త :

హిందువులలో పురుషుడు ఎవ్వడైననూ వీలునామా వ్రాయకుండా మరణించినచో, ఆ మరణించిన వ్యక్తి ఆస్థి బంధువులను మొదటి తరగతి, రెండవ తరగతి అని రెండు తరగతులుగా చట్ట ప్రకారం వర్గీకరించబడింది. వీలునామా వ్రాయకుండా చనిపోయిన హిందూ పురుషుని ఆస్థి షెడ్యూలులో మొదటి తరగతిలో చెప్పబడిన సన్నిహిత బంధువులకు మాత్రమే వారసత్వ రీత్యా దఖలుపడును. మొదటి తరగతి వారసులలో ఏ ఒక్కరూ లేని యెడల వారసత్వము రెండవ తరగతి బంధువులకు చెందును. ఈ రెండు తరగతులలో బంధువులలో ఏ ఒక్కరూ లేని యెడల వారసత్వము పితృ సంబంధమైన వారసులకు మాత్రమే సంక్రమించును. షెడ్యూలులో చెప్పబడిన రెండు తరగతుల బంధువులు గానీ, పితృ సంబంధమైన వారసులు గానీ లేని యెడల వారసత్వము స్త్రీ మూలముగా ఏర్పడిన బంధువులకు మాత్రమే దఖలుపడును. హిందూ వారసత్వ చట్టం 1956 సెక్షన్-8, సబ్ సెక్షన్-ఎ,బి,సి,డి లందు ఈ విషయము సుస్పష్టముగా విశదీకరించబడినది. అనగా ఈ సెక్షన్ ప్రకారం వారసులందరినీ నాలుగు తరగతులుగా వర్గీకరించి మొదటి షెడ్యూలులో వారసులు, రెండవ షెడ్యూలులోని వారసులు, మూడు – మొదటి, రెండు వర్గములకు చెందిన వారసులు లేని యెడల చనిపోయిన వ్యక్తి స్త్రీ మూలక వారసులకు వారసత్వపు హక్కు సిద్ధించును. ఈ చట్టము ప్రారంభము నాటికే ఎవరేని వారసుని యెందు స్థిరపడిన ఆస్థిని తిరగతోడే అవకాశము మాత్రము కల్పించబడలేదు. ఈ సెక్షన్ పురుష హిందువు యొక్క వారసత్వమే నిర్ణయించును గానీ, ఆ పురుషుడు అవిభక్త కుటుంబ మెంబరుగా ఉన్న యెడల ఆ అవిభక్త కుటుంబములో అతనికి గల హక్కుకు సంబంధించినదికాదు. హిందూ మితాక్షర అవిభక్త కుటుంబ సభ్యుడు ఎవరైనా వీలునామా వ్రాయకుండా చనిపోయిన యెడల అతనికి అవిభక్త కుటుంబములో గల హక్కును పొందదగు సభ్యులు ఎవ్వరూ లేని యెడల సదరు హక్కు ఈ సెక్షన్ ప్రకారం ఆ వ్యక్తి వారసులకే చెందును. మొదటి షెడ్యూలులోని వారసులందరూ ప్రాథమిక వారసులగుదురు, వారెవరనగా చనిపోయిన వ్యక్తి కుమారుడు, కుమార్తె, భార్య, తల్లీ, కుమారుడు గానీ, కుమార్తె గానీ సంతానవంతులై తండ్రి కంటే ముందుగనే మరణించిన యెడల ఆ మరణించిన కుమార్తెకు గానీ, కుమారునికి గానీ రాదగు వాటా ఆస్థి వారి వారి సంతతికి మాత్రమే చెందును. కావున హైందవ పురుషుని ఆస్థి పొందుటలో పై తెల్పిన వారికి మాత్రమే చెందునని చట్టము సుస్పష్టముగా తెలియజేయుచున్నది.

వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 17 మే 2023

# వినీలాకాశంలో ధృవతార మొల్ల



మండల పరిధిలోని పెద్ద గోపవరంలో జన్మించిన కవయిత్రి మొల్ల వినీలాకాశంలో ధృవతారగా విరాజిల్లుతోంది. మొల్ల రచించిన రామాయణం దినదినాన మహిమలను చాటడం మండల ప్రజలకు మరింత గర్వకారణంగా మారింది. తెలుగు కవితలల్లిన తొలి విదూషీమణిగా, రామాయణ కావ్య రచన రసధునిగా రాణకెక్కిన మొల్ల కుమ్మరి కుల సంజాత. కేసన గురు లింగ జంగమార్చనపరుడు, అనవరత శివభక్తుడు, కవయిత్రి మొల్ల 15 శతాబ్దం ఉత్తరార్థమూ, 16వ శతాబ్దము పూర్వార్థం మధ్య కాలంలో జీవించి ఉండవచ్చునని పరిశోధకులు, పండితులు, చరిత్రకారులు నిర్ణయించారు. ఆమె తన కాలాన్ని గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. మొల్ల శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానమును సందర్శించినట్లు అష్టదిగ్గజముల సరసన కవితలు చెప్పి మెప్పు పొందారు. తెనాలి రామకృష్ణ కవి వంటి వికట కవి సమక్షంలో కవితలల్లిన మహిమాన్వితురాలు మొల్ల. అంతేకాక రామకృష్ణుని కవితలలో పాలుపంచుకొని చతురోక్తులను ప్రదర్శించి మేధావిగా నిలిచారు మొల్ల. విజయనగర యుగంలో తుళువ వంశము 1509-1530 లో శ్రీకృష్ణ దేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించినట్లు చరిత్ర వివరిస్తున్నది. 16వ శతాబ్దానికి చెందిన ఏకాంబరనాధుడు అనే చరిత్రకారుడు సిద్దేశ్వర చరిత్ర అనే వచన కావ్యంలో మొల్లను గురించి కొన్ని వివరాలు తెలియజేశారు. మొల్ల రామాయణాన్ని రచన కావ్యంగా వ్రాసి ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉండిన విద్వాంసులు, ఇది శూద్రకవిత్వం, కనుక నిషేదం అని నిరాకరించారట. మొల్ల తాను రచించిన రామాయణ పద్యాలను కొన్నింటిని రాజుగారికి చదివి విన్పించిందట. సహృదయులైన రాజుగారు మొల్ల ప్రతిభా పాండిత్య విశేషాలను మెచ్చుకొని ఆమెకు పల్లకి, నగిరి, నిత్య జీవితం ఏర్పాటుచేసి తన దేవేరి విశాలాక్షి సన్నిధికి పంపించారని ఏకామ్రనాధుడు తన కావ్యంలో వివరించారు. అదేవిధంగా ఏకామ్రనాధుడు ప్రతాప చరిత్ర రాసిన కాలంతో సరిపోల్చుకుంటే మొల్ల 1581 పూర్వమే జీవించి ఉండేదని తెలియజేశారు. కావున మొల్ల 15వ శతాబ్దం, 16వ శతాబ్దం ప్రథమార్థం మొల్లమాంబ కాలమన్నది నిర్వివాదాంశంగా నిలిచింది. ప్రారంభ దశలో మొల్ల ఒక వచన రామాయణాన్ని రాసినట్లు అనంతరం రామాయణాన్ని పద్య గద్యాత్మకంగా మొల్ల రామాయణం రాసినట్లు వెల్లడవుతున్నది. మొల్ల తాను మళ్లీ రామాయణాన్ని రాయటానికి కల కారణాన్ని సహేతుకంగా చెప్పుకున్నది. అది రఘురామ చరితము ఆధారముగ విన్న గ్రొత్తమై లక్షణ సంపాద్యమై పుణ్యస్థితి వేదమ్మై తోచకున్న అని చెప్పినట్లు మొల్ల రామాయణంలో వివరిం చింది. మొల్ల శ్రీరామ భక్తు రాలు, శివ భక్తుల కుటుం బంలో పుట్టిన పావని. విఖ్యాత గోపవరపు శ్రీకంఠ మల్లేశ్వర వరము చేత కవి త్వం చెప్పడం నేర్చుకు న్నానని భక్తి భావంతో ప్రకటించింది. ఆమెకు శ్రీరాముడంటే భక్తి ప్రభక్తులు మెండు. ఇహపర సాధనమైన పుణ్యచరితం కనుక, పోతనామాత్యుని ఆదర్శంగా తీసుకున్నట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. చెప్పుమనె రామచంద్రుడు చెప్పించిన పలుకు మీద తెలుగునకు పొందైన, వీనులకు విందైన కందువ మాటలను, సామెతలను అందంగా తీర్చిదిద్ది రామకథను మనకందించిన మహా తపస్విని మొల్ల. పాండిత్య ప్రకర్షకు, అర్థ వ్యక్తము కల సులభశైలికి, సహజమగు వర్ణనలకు శబ్దార్థముల హృదయంగను రూపకల్పనకు ఆమె కవితా శిల్పము ప్రసిద్ధిగాంచినది. రాజస్థానాలలో ఉండిన కవులలో అహంకారము, ఆడంబరత కన్పిస్తే నిరాడంబర జీవితం గడుపుతూ కవిత్వం రాసిన మొల్లలో అకుంఠిత భక్తి భావంతోనే కలం పట్టిన మొల్ల తన రామాయణ రచనలో హృదయ సంస్కారం పండించుకున్నది. శ్రీరాముడు కరుణతో కాపాడటానికి, వారి వారి భక్తే కారణం కాని చదువులు, పాండిత్య ప్రకర్షలు కావని మొల్ల ప్రగాఢ విశ్వాసం. మొల్లమాంబలోని వినయ స్వభావం పలు తావులలో మనకు కనిపిస్తుంది. తాను గొప్ప విధూషీమణినని కానీ వెనుకటి కవులందరి కన్న మిన్నగా రామాయణం రాయబోతున్నానని కాని ఎక్కడా ఆమె చెప్పుకోలేదు. పూర్వ కవులు సాంస్కృత గ్రంధాలను తెలుగులోకి మారుస్తూ కేవలం తన పాండిత్య ప్రదర్శన కోసమే మళ్లీ సంస్కృత పదాలనే వాడటం మొల్లకు ఏమాత్రం రుచించలేదు. తెలుగు కవిత్వం వింటుండగానే అర్థం అయిపోవాలి. మొల్లకు సంస్కృత పరిజ్ఞానం లేదని కాని, సంస్కృత పద ప్రయోగం తెలియదు అని కాని భావించడం పొరపాటు. ఆమె తన రామాయణ రచనలో అవసర సందర్భాలలో దీర్ఘ సమాఘటితమైన ప్రౌఢ రచనచేసి పండిత పామరుల చేత ఆదరణ పొందినది. రాయలు వారి నిండు సభలో మొల్ల కవిత్వాన్ని వినగోరినప్పుడు ఆమె తన రామాయణంలోని కొన్ని ఘట్టాలను మృదుమధురంగా కంఠస్వరంతో చదివి విన్పించెను. ఆమె కవిత్వాన్ని విన్న శ్రీకృష్ణదేవరాయలు ఆమెను పలు రకాలుగా ప్రశంసించడం జరిగింది. అనంతరం రాయలు ఆమె పాండిత్య ప్రతిభను పలు విధాలుగా కొనియాడి బహుమానాలను అందజేయడం జరిగింది. అందులో భాగంగా మాణ్యములను కూడా మొల్ల పేరున రాయించడం జరిగినది. రాయలు వారు ఒక పద్యము వినగోరెను. మకరి చేతిలో చిక్కిన గజరాజును రక్షించుటకు శ్రీ మహా విష్ణువు పరుగులెత్తే ప్రయాణ విధమును వస్తువుగా వర్ణించమని వికటకవిని కోరారు.



రాయలసీమ మాండళిక పదాలైన గమ్మ, బస్సు, రింగు, బొంగు అను పదములను చొప్పిం చి పద్యము చెప్పమని కోరారు. ఈ అగ్ని పరీక్షను మహిమాన్వితమైన మొల్ల అవలీలగా అధిగమించిం ది. అత్యంత మనోహరమైన ఆమె చెప్పిన కవిత్వా న్ని వినగానే అక్కడున్న కవులతో పాటు ప్రజలు, పండితుల హృదయాలు ఉప్పొంగిపో సాగాయి. అంతేకాకుండా ఆనంద భాష్పాలు జాలువారాయి. రాయలు వారు మిక్కిలి ప్రశంసించి నీవు నివసించు గోపవరం గ్రామమును సకల స్వతంత్రముగా తోడను నీకొసంగుచున్నాను అని తెలియజేశారు.

ఈ విధముగా స్త్రీలు స్వతంత్రముగా బయటకు రావడానికి సాహసించని ఆ రోజులలో ఒక స్త్రీగా ఉండి పదువురు మెచ్చుకొనే విధంగా రామాయణ రచనలను చేయడంతో పాటు ఔరా అని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తిన మహిళ వినీలాకాశంలో ధృవతారగా నిలిచిందనడంలో ఎటువంటి సందేహం లేదు. అంతేకాకుండా గోపవరం మండలంలో మొల్ల జన్మించడం మండల ప్రజలకు మరింత గర్వకారణంగా తయారై నట్లయింది. కాగా మొల్ల మహిమకు నిదర్శనం బద్వేలు-నెల్లూరు ప్రధాన రహదారిలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో మొల్ల పర్యాటక కేంద్రాన్ని నిర్మించడం, అక్కడ ప్రతినిత్యం మొల్ల పారాయణంతో పాటు పలువురు సందర్శకులు మొల్ల పర్యాటక కేంద్రంలోకి రావడం విశేషంగా మారింది. అంతేకాకుండా మొల్ల చరిత్రను విన్న ప్రతి ఒక్కరూ ఆనందంతో పరవసించిపోవడం ప్రత్యేకంగా మారింది.
















# భక్తుల కొంగుబంగారం శ్రీముక్తి రామలింగేశ్వర దేవాలయం





అతి పురాతన చరిత్ర కలిగిన భక్తుల కోరికలను తీర్చే శ్రీ ముక్తి రామ లింగేశ్వర శ్రీ హనుమత్ లింగేశ్వర స్వామి దేవాలయాలు ఎంతో ప్రసిద్ధి గాంచినది ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరంలో వెలసిన ఈ ఆలయాల చరిత్ర ఎంతో ప్రసిద్ధి చెందినది గా చెప్పవచ్చు ఈ దేవాలయాలలో ప్రతి శివరాత్రికి స్వామివారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహిస్తారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు స్వామివారి స్థలపురాణం తెలిపే ప్రయ త్నం చేద్దాం.

### స్థల పురాణము

పురాణ కథల ప్రకారం లంకాధిపతియైన రావణుడు సాక్షాత్తూ బ్రహ్మ మనుమడు. అందు చేత బ్రాహ్మణుడు. రాముడు రావణుడిని సంహరించిన తర్వాత ఒక బ్రాహ్మణుడిని చంపినందుకు బ్రహ్మ హత్యా పాతకం రాముడిని ఒక పిల్లి రూపంలో వెంటబడింది. దానినుంచి విముక్తుడు కావడానికి శ్రీ రాముడు దండకారణ్యంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాలనుకొన్నాడు. పినాకినీ నదీ తీరాన గల ఈ ప్రాంతాన్ని పవిత్రమైనదిగా భావించి ఇక్కడే శివలింగ ప్రతిష్ఠ చేయడానికి నిశ్చయించుకొన్నాడు. ముహూర్తం నిర్ణయించి, కాశీ నుంచి శివలింగాన్ని తెమ్మని హనుమంతుడిని పంపగా, హనుమంతుడు సకాలంలో తిరిగి రాలేక పోయాడు. దాంతో రాముడే పెన్నా నది లోని ఇసుక తో ఒక లింగాన్ని తయరు చేసి ప్రతిష్ఠించాడు. అది సైకత లింగం (ఇసుక లింగం)గా పేరుగాంచింది. కాశీ నుంచి ఆలస్యంగా తిరిగి వచ్చిన హనుమంతుడు అది చూసి నొచ్చుకున్నాడు. దాంతో శ్రీ రాముడు అతడికి సంతోషం కలిగేటట్లు సైకత లింగానికి ఎదురుగా కొంత దూరంలో హనుమంతుడు కాశీ నుంచి తెచ్చిన లింగాన్ని కూడా ప్రతిష్ఠించాడు. అందుకే ఆక్షేత్రాల్ని రామలింగేశ్వర క్షేత్రమ్, హనుమ క్షేత్రం అని పిలుస్తారు. రాముడు మొదటి పూజ కాశీ లింగానికీ, తరువాతి పూజ సైకత లింగానికీ జరిగేటట్లు అనుగ్రహించాడు. ఈ ప్రతిష్ఠలు అయిన తర్వాత పిల్లి పెన్నా నది ఒడ్డు దాకా నడచి అదృశ్యమైందట. పిల్లి పాదాల గుర్తులు అక్కడ ఉన్నాయంటారు. పిల్లి నదిలో దిగిన చోటును "పిల్లి గుండం" అంటారు. రామలింగేశ్వర స్వామికి ప్రక్కన రాజరాజేశ్వరి, శ్రీ చక్రం ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, సుబ్రహ్మణ్యస్వామి ఉన్నారు. చైత్ర మాసంలో పౌర్ణమి నుండి పది రోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. కార్తీక సోమవారాల్లో భక్తులు విశేషంగా వస్తారు. ఈ ఆలయానికి, ప్రక్కన, వెనుక ఇద్దరు మునుల ఆలయాలున్నాయి. స్థలపురాణం ప్రకారం శ్రీ రాముడు శివ లింగాన్ని ప్రొద్దు పొడవక ముందే తయారు చేసి ప్రతిష్ఠించాడు. అందుకే ఈ ఊరిని ప్రొద్దుటూరు అంటారు. ఈ క్షేత్ర ప్రతిష్ఠతో రాముడు బ్రహ్మహత్యా పాతకం నుంచి విముక్తిని పొందాడు. అందుకే ఈ క్షేత్రాన్ని ముక్తి రామేశ్వరం అంటారు.

### ఆలయ చరిత్ర

శాసనాల ప్రకారం శ్రీ కృష్ణదేవరాయలు ఈ దేవాలయం మీద ఐదు అంతస్థుల గోపురం నిర్మించాడు. గోపురం చుట్టూరా చెక్కిన అనేక మంది దేవతల అందమైన విగ్రహాలు ఆ నాటి శిల్పుల పనితనాన్నీ, సామర్థ్యాన్నీ చెప్పకనే చెబుతాయి. స్థలపురాణం ప్రకారం శ్రీ రాముడు శివ లింగాన్ని ప్రొద్దు పొడవక ముందే తయారు చేసి ప్రతిష్ఠించాడు. అందుకే ఈ ఊరిని ప్రొద్దుటూరు అంటారు.

### రామలింగేశ్వర ఆలయము

ఈ క్షేత్ర దైవం లింగరూపంలో ఉండే శ్రీ రామలింగేశ్వరుడు. ఈ శివ లింగాన్ని ప్రతిష్ఠించింది శ్రీ రాముడు. అందుకే దీనికి రామేశ్వరమని పేరు. 56 అంగుళాల ఎత్తుండే ఈ లింగం మీద శ్రీ రాముడి వేలి ముద్రలు ఇప్పటికీ ఉన్నాయి. ఇక్కడికి కొన్ని అడుగుల దూరంలోనే శ్రీ హనుమత్ లింగేశ్వర క్షేత్రముంది. హన్మంతుడు కాశీ నుంచి తీసుకు వచ్చిన శివ లింగాన్ని శ్రీ రాముడు ప్రతిష్ఠించింది ఇక్కడే. శ్రీ రామలింగేశ్వర ఆలయం ప్రక్కనే శ్రీ రాజరాజేశ్వరీ ఆలయం కూడా ఉంది. ఇక్కడ శ్రీ ఆది శంకరాచార్యులు పూజించిన "శ్రీ చక్ర యంత్రం" ఉంది. ఈ చక్ర ప్రభావం వల్లే ఈ పట్టణం బాగా అభివృద్ధి చెందిందని ప్రొద్దుటూరు వాసులు బలంగా విశ్వసిస్తారు. ఈ శ్రీ చక్ర యంత్రాన్ని పూజించిన వారికి కోరికలన్నీ తీరి జీవితంలో సుఖశాంతులు కలుగుతాయని ఒక నమ్మకముంది.

### శిల్పకళ :

ముక్తి రామలింగేశ్వరాలయం సువిశాలమైన స్థలంలో నిర్మించిన పెద్ద ఆలయం. అందమైన శిల్పాలతో అలరారే ఐదంతస్థుల రాజగోపురం చూపరులకు కనువిందు చేస్తుంది.ఈ ఆలయం చుట్టూ రక్షణ కోసం నిర్మించిన తలుపులతో బలమైన గోడలున్నాయి. ఈ ఆలయ గోపురాన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించాడని ప్రతీతి. కుమారస్వామి, దుర్గా దేవి, నాట్య గణపతి, శివపార్వతులు, గరుడ వాహనం మీదుండే విష్ణువు, కాళీయ మర్ధనం చేసే కృష్ణుడు మొదలైన విగ్రహాలు పూర్వ కాలపు శిల్పుల కళానైపుణ్యానికి నిదర్శనాలుగా ఉన్నాయి.

### ఈ పురాతన ఆలయాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న ఎమ్మెల్యే :

శ్రీముఖి రామలింగేశ్వర స్వామి శ్రీ హనుమత్ లింగేశ్వర స్వామి దేవాలయాల అభివృద్ధికి సుమారు పది కోట్ల రూపాయల అంచనాతో ఇదివరకే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి నివేదించారు. ఈ మధ్య కడప జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రిని కలిసి ఎమ్మెల్యే రాచమల్లు సూచనప్రా యంగా తెలిపారు దీనికి స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహ న్రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది శివ ప్రసాద్ రెడ్డి నేతృత్వంలో శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అతి త్వరలో దేవాలయాల రూపురేఖలు మారుతున్న ఏడవడం లో సందేహం లేదు.







# వార్త 29వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

# కలివికోడి కనుమరుగయ్యేనా!



ప్రపంచంలోనే అరుదైన పక్షిజాతి అయిన కలివికోడి కనుమరుగ య్యేనా అని పలువురు చర్చించుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కడప జిల్లా అట్లూరు మండలంలోని దట్టమైన లంకమల్ల అభయారణ్యం లో అరుదైన పక్షిజాతి కలివికోడి సంచారం ఉన్నట్లు ఫారెస్టు అధికారులు గుర్తించి. లంకమల్లేశ్వరుడు నిలయంగా ఉన్న ఈ అభయారణ్యాన్ని లంక మల్ల అభయారణ్యంగా పిలుస్తారు. ఏడు కొండల స్వామికి నెలవు అయిన తిరుమల, తిరుపతికి తొలి గడపగా పేరొందిన కడప జిల్లాలో ప్రకృతి వర ప్రసాదినిగా భాసిల్లుతున్న వన్యమృగ అభయారణ్యం శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యం. ప్రపంచంలో అంతరించి పోయిందనుకున్న అరుదైన పక్షి కలివికోడి ఈ అభయారణ్యంలో తిరుగాడుతుందని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పడంతో ఈ అభయారణ్యానికి ప్రత్యేకత సంతరించుకుంది. ముఖ్యంగా అత్యంత విలువైన ఎర్రచందనం విరివిగా ఉండటం, సరిహద్దు జిల్లా అయిన చిత్తూరు జిల్లాలో తప్ప మరెక్కడా ఇలాంటి అడవి కనిపించక పోవడం ఈ అభయారణ్యానికి మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. దాదాపు 464 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి విలువైన అటవీ సంపద తో పాటు, అత్యంత ప్రాధాన్యత గల వన్యమృగ సంచారం ఉన్న లంక మల్ల అభయారణ్యాన్ని 1988లో ప్రభుత్వ శ్రీ లంకమల్లేశ్వర అభయార ణ్యంగా ప్రకటించింది. మైదుకూరు-నెల్లూరు ప్రధాన రహదారి మార్గంలో ఉన్న రాణిబావి ప్రాంతం ఈ అభయారణ్యానికి ముఖ ద్వారంగా చెప్ప వచ్చు. పూర్తిగా అంతరించి పోయిందనుకున్న కలివికోడి ఈ అభయా రణ్యంలో సంచరించడం విశేషం. ఈ పక్షికి పగటి పూట కళ్లు కనిపించక రాత్రి వేళల్లోనే సంచరిస్తూ ఎక్కువగా కలివి పొదలు ఉన్న చిట్టడవుల్లో సంచరిస్తున్నందున ఈ పక్షిని కలివికోడిగా పిలుస్తున్నారు. మొట్ట మొదటి సారిగా ఈ పక్షిని వన్య ప్రాణ సంరక్షణ విభాగం 1949లో కనుగొని 1900 దశకంలో చివరిసారిగా చూశారు. అప్పటి నుంచి ఈ పక్షి కనిపించక పోవడం వలన అంతరించి పోయిందని నిరాశ చెందుతున్న సమయంలో 1986లో అట్లూరు మండలం రెడ్డిపల్లె గ్రామ సమీపాన లంకమల్ల రిజర్వు అటవీ ప్రాంతంలో ఈ పక్షిని గుర్తించారు. వివిధ రకాల జంతు జాతులకు, వన్య ప్రాణులకు ఆలవాలమైన ఈ అభయారణ్యం ఎర్రచందనంతో పాటు, నల్లమద్ది, తెల్లమద్ది, బందారు, ఏగిస, చిట్టిరేగి, అడవి మామిడి, చిరు మాను, ఏపి, వెదురు, ఉసిరి, తాండ్ర మొదలైన కలపతో పాటు ఫలసాయాన్ని ఇచ్చే వృక్ష జాతులు అనేకం ఉన్నాయి. అశ్వగంధ, పదపత్రి లాంటి దివ్య ఔషద మొక్కలు తేనె, బంక వంటి ఉపయోగకరమైన వస్తువులు ఈ అరణ్యంలో ఎన్నో దొరుకుతున్నాయి. అంతరిస్తున్న కలివికోడితో పాటు, మూషిక జింక, కొండగొర్రె, గడ్డి జింక, చిరుతపులి, రేసుకుక్క, నక్క, దుమ్మలగుండు, ఎలుగు బంటి, ముల్లపంది, కణంజు, దుప్పి, అడవిపంది తదితర జాతులతో పాటు వివిధ రకాలకు చెందిన పక్షి జాతులు కూడా ఈ అభయారణ్యంలో ఉన్నాయి. దాదాపు 20 నుంచి 30 వరకు కలివికోడి పక్షులు ఈ ప్రాంతంలో ఉన్నట్లు వన్య సంరక్షణ విభాగం అధికారులు చెబుతున్నారు. బద్వేలు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, సిద్ధవటం, అట్లూరు మండలాల పరిధిలో లంకమల్ల అభయారణ్యం విస్తరించి ఉంది. 464 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన లంకమల అభయారణ్యంలో అటవీ సంపదను కాపాడటానికి, వన్య ప్రాణులను సంరక్షించటానికి తగిన ఫారెస్టు సిబ్బంది లేకపోవడం వలన విలువైన అటవీ సంపద స్మగ్లర్ల పాలవుతోంది. విభాగంలో డిఎఫ్‌వోతో పాటు, రేంజి అధికారులు, ఫారెస్టు గార్డులు, వాచర్లు మాత్రమే ఉన్నారు. ఇంత తక్కువ మంది సిబ్బందితో భారీ వైశాల్యంతో కూడి ఉన్న అభయారణ్యాన్ని సాధ్యమైన మేర సంరక్షించడం కష్టసాధ్యమే అయినా ప్రతి ఒక్కరు తమ విధిగా అభయా రణ్య రక్షణకు కృషిచేయాలని, అలాంటపుడు మాత్రమే అభయారణ్యాన్ని కాపాడుకోగలుగుతామని అధికారులు అంటున్నారు. ఈ అభయారణ్యానికి సమీపాన 104 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు అడవులపై ఆధార పడి అత్యధిక శాతం జీవనం సాగిస్తున్నారు. అభయారణ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఈ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరో ప్రత్యామ్నాయాన్ని చూపించి వన్యమృగ సంపదను, అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇక ఈ అభయారణ్యంలో లంకమల్లేశ్వర స్వామి దేవస్థానంతో పాటు నిత్యపూజ స్వామి ఆలయం, గోపాలస్వామి ఆలయం, కుంకుమ గుండం, పసుపు గుండం అని పిలువబడే జలపాతాలు ఉండటం విశేషం. అలాగే కైలాస కోన, దవళేశ్వరం, తీర్థాలు వంటి కొన్ని అందమైన ప్రదేశాలు కూడా ఈ ప్రాంతంలో దర్శనమిస్తాయి. ఈ అభయారణ్యం అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు సందర్శించడానికి అనువుగా ఉంటుందని పేర్కొంటున్నారు. కలివికోడి.. కలిమికోడిగా మారిన వైనం. జలయజ్ఞంలో భాగంగా తెలుగు గంగ ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం అభయారణ్యంలో నిర్మించాల్సి రావడంతో అటవీ శాఖ, నీటి పారుదల శాఖ అధికారుల మధ్య స్పర్థలు ఏర్పడి కాల్వ నిర్మాణాన్ని నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూములతో పాటు, కాల్వ పైభాగాన ఉన్న భూములు కూడా రైతులు కోల్పోవాల్సి రావడం మధ్యంతర మార్గంగా ప్రభుత్వం భూములు నష్టపోతున్న దాదాపు 400 ఎకరాలకు చెందిన రైతులకు రూ.20 కోట్లు నష్ట పరిహారం చెల్లించడంతో రైతులకు కలివికోడి కలిమికోడిగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు.




## సిద్దవటం ప్రసిద్ద పురాతన మట్లి రాజుల కోట పురాతన చరిత్ర



ఆంధ్రప్రదేశ్ నందలి దక్కన్ పీఠభూమిలో వెలసిన రాయలసీమకు కడప పట్టణం కేంద్రమై యున్నది. కడపకు 20 కిలో మీటర్ల దూరంలో పెన్నా నదికి ఉత్తరం ఒడ్డున చరిత్ర ప్రసిద్దికెక్కిన సిద్దవటం వెలసివున్నది. అందులోని మట్లిరాజుల కోట, దేవాలయాలు, మసీదులు పురావస్తు శాఖకు సంబంధించినవిగా వెలసియున్నవి. రాజులు, నవాబులు ఏలిన ఈ ప్రదేశం పురాతన వైభవమును సంతరించుకున్నది. సంస్కృతి, నాగరికతలతో కూడుకొని ఉన్నది. ఒకనాడు "మట్లిరాజులు" హయాములో వైభవోపేతంగా వెల్లివిరిసిన సిద్దవటం ఇప్పుడు అనాధవలె అంధకారంలో కంప చెట్ల మధ్య కనుమరుగైనట్లు నిర్మానుష్యముగా ఉన్నది. అడుగడుగునా వెలసిన దేవాలయములు, మసీదులు భక్తులకు ఆశ్రయము లేక ధూప, దీప, నైకార్యములకు నోచుకోక అందవిహీనంగా పడివున్నాయి. కొందరు రాజకీయ నాయకుల దృష్టికి లోనై అంత: కలహములు, కుల, మత సామరస్యములు కోల్పోయి, కక్షలు, ఈర్ష్యా ద్వేషాలకు రెచ్చిపోయి అభివృద్ధికి నోచుకోలేదు. సూర్యాస్తమయం అయిన వెంటనే గుడ్లగూబల అరుపులతోను, సర్పాల స్వైరవిహారంతో ఈ కోట నిర్మానుష్యముగా ఉంది.

"సర్ థామస్ మన్రో" కడప జిల్లా కలెక్టర్‌గా ఉన్నపుడు 1807 నుండి 1812 వరకు సిద్దవటమును కడప జిల్లా ముఖ్య పట్టణముగా ఏర్పరచి ఉండినారు. ప్రస్తుతం మున్సిఫ్, మెజిస్ట్రేట్ కార్యాలయం, కడప జిల్లా కలెక్టరు కార్యాలయము గాను, తాలూకా కార్యాలయం ఆర్డీవో కార్యాలయముగాను ఉండినవి. ప్రస్తుత ఫారెస్టు రేంజరు కార్యాలయం వెనుక భాగంగా పాత కచేరి తాలూకా కార్యాలయంగా ఉండేది. మరుగున పడివున్న సిద్దవటం చరిత్రను పరిశీలించి కడప జిల్లా గెజిట్ నందు ప్రచురింపజేసిన సర్ థామస్ మన్రో, ఆంగ్ల కలెక్టరు చిరస్మరణీయుడు. వర్షము విపరీతమై తరచూ పెన్నా నది వరదలందు, 8 మాసములకు పైగా రాకపోకలకు ఇబ్బందిగా ఉండుట చేత వంతెనలు లేనికారణంగా చుట్టుప్రక్కల కీకారణ్యము దట్టముగా ఉండుట వలన కడప పట్టణమును సిద్దవటం నుండి కడపకు తరలించినారు. దట్టమైన లంకమల అడవుల మధ్య పెట్టని కోట గోడవలె నాలుగు వైపులా పర్వత శ్రేణులు వెలసివుండగా పెన్నా నది పడమర నుండి తూర్పునకు ప్రవహించుచున్నది.

































































